




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 187 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు గురువారం 13 మార్చి 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 187 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE THU 13 MARCH 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## ఎప్పుడూ మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యమన్న సీఎం
- డ్వాక్రా మహిళలకు రూ.65 వేల కోట్ల రుణాలు అందిస్తామని వెల్లడి
- మహిళా భద్రతకు శక్తి యాప్, 164 శక్తి టీమ్స్ ఏర్పాటు చేస్తున్నట్టు వివరణ



**పెన్ పవర్ డెస్క్:**మహిళా సాధికారతతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని... టీడీపీది, మహిళలది అన్నాచెల్లెళ్ల బంధం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శాసనసభలో మహిళా సాధికారతపై ఆయన మాట్లాడుతూ, టీడీపీ ఆవిర్భావం నుంచే మహిళాభ్యున్నతికి కృషి జరిగిందని, నిన్న, నేడు, రేపు ఎల్లప్పుడూ వారి అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ఉద్ఘాటించారు. గతంలో ఎన్టీఆర్ మహిళలకు ఆస్తి హక్కు కల్పించారని, తాను డ్వాక్రా సంఘాలను స్థాపించి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేశామని చంద్రబాబు గుర్తు చేశారు. రానున్న సంవత్సరంలో లక్షా 75 వేల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రపంచం నాగరికత వైపు పయనిస్తున్నా, నేటికీ మహిళలపై వివక్ష కొనసాగడం బాధాకరమని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళాభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆదర్శంగా నిలవాలని, రాజకీయాల్లో ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. అమరావతి నేడు నిలబడి ఉందంటే అది మహిళలు చూపిన చొరవ వల్లే సాధ్యమైందని చంద్రబాబు అన్నారు. 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూమిని రాజధాని కోసం స్వచ్ఛందంగా ఇచ్చారని గుర్తు చేశారు. మూడు రాజధానుల పేరుతో గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడిందని, అమరావతి కోసం భూములిచ్చిన రైతులను అవహేళన చేసిందని విమర్శించారు. ఐదేళ్లపాటు అమరావతి మహిళలు వీరవనితల్లా పోరాడారని, వారి ఇళ్లపై డ్రోన్‌లు ఎగరవేసి పైశాచికానందం పొందారని ధ్వజమెత్తారు. మహిళలను విద్యాపరంగా ప్రోత్సహించేందుకు ఎన్టీఆర్ 1983లో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారని, ప్రతి కిలోమీటరుకు ప్రాథమిక పాఠశాల, ప్రతి మూడు కిలోమీటర్లకు అప్పర్ ప్రైమరీ, ప్రతి ఐదు కిలోమీటర్లకు హైస్కూల్, మండలానికి ఒక జూనియర్ కాలేజీ, ప్రతి డివిజన్‌కు ఇంజినీరింగ్ కాలేజీ, ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశామని చంద్రబాబు వివరించారు. 1995లో తాను ముఖ్యమంత్రి అయ్యాక విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు పెట్టాలని నిర్ణయించానని గుర్తు చేశారు. ఆడపిల్ల పుడితే మహాలక్ష్మిగా భావించి రూ.5 వేలు బ్యాంకులో డిపాజిట్ చేసి,

వివరాలు 2లో..

## చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి పోలీసుల నోటీసులు



- ఎన్నికల సమయంలో కోడ్ ఉల్లంఘన కేసులు
- యర్రగొండపాలెం ఆర్వో శ్రీలేఖను బెదిరించిన కేసు కూడా
- ఒంగోలు వైసీపీ కార్యాలయంలో నోటీసులు అందించిన పోలీసులు

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఐదు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి చెవిరెడ్డికి నోటీసులు ఇచ్చారు. 2024 ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంట్

వివరాలు 2లో..

## ప్రతి కార్యకర్తకి అండగా ఉంటా

### వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగన్

- కన్నుమూసి తెరిచేలోగా ఏడాది గడిచిపోయిందన్న జగన్
- ప్రతిపక్షంలో కూర్చోవడం వైసీపీకి కొత్తకాదని వ్యాఖ్య
- ప్రజల గొంతుకగా వైసీపీ పోరాడుతుందన్న జగన్



**పెన్ పవర్ డెస్క్:**కన్నుమూసి తెరిచేలోగా ఏడాది సమయం గడిచిపోయిందని... మరో మూడు, నాలుగేళ్లు గడిస్తే మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ అధినేత జగన్ అన్నారు. ప్రతిపక్షంలో కూర్చోవడం వైసీపీకి కొత్తకాదని... గతంలో పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నామని తెలిపారు. వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జెండాను జగన్ ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల కష్టాల నుంచి పుట్టిన పార్టీ వైసీపీ అని జగన్ అన్నారు. వైసీపీ ఆవిర్భవించి 15 ఏళ్లు అవుతోందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలను అక్కున చేర్చుకున్నామని చెప్పారు. వైసీపీ చెప్పిందంటే... తప్పకుండా చేస్తుందనే నమ్మకం ప్రజల్లో ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు. ప్రజల గొంతుకగా వైసీపీ పోరాడుతుందని చెప్పారు. వసతి దీవెనకు ఏడాదికి రూ. 1,100 కోట్లు, ఫీజు రీయింబర్స్ మెంట్ కు రూ. 2,800 కోట్లు కావాలని... అయితే కూటమి ప్రభుత్వం గత ఏడాది కేవలం

వివరాలు 2లో..

## మే నుంచి 'తల్లికి వందనం'.. ఎంతమంది పిల్లలున్నా అకౌంట్లోకి డబ్బులు




**పెన్ పవర్ డెస్క్:** 'తల్లికి వందనం' పథకం అమలుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. మే నెలలో 'తల్లికి వందనం' ప్రారంభిస్తామని, ఎంతమంది పిల్లలున్నా పథకం వర్తిస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సంతాన ఉత్పత్తిని పెంచాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఎన్ని కాన్పులకైనా ప్రసూతి సెలవులు ఇస్తామని, ఈ నెలలో పీ4 విధానం ప్రారంభిస్తామని -తెలిపారు. పేదరికాన్ని తగ్గిస్తూ సమాజ నిర్మాణం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకొచ్చారు. డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేస్తామని, మహిళల భద్రత కోసం శక్తి యాప్ తీసుకొచ్చామని ఏపీ సీఎం చంద్రబాబు గుర్తుచేశారు.

వివరాలు 2లో..

## మారిషస్ దేశ అత్యున్నత పురస్కారం అందుకున్న ప్రధాని మోదీ

- మారిషస్ లో ప్రధాని మోదీ పర్యటన
- అత్యున్నత జాతీయ పురస్కారం అందించి మోదీని గౌరవించిన మారిషస్ ప్రభుత్వం
- ఇది 140 కోట్ల మంది భారతీయులకు లభించిన గౌరవమన్న మోదీ



వివరాలు 2లో..

## ఏపీ హైకోర్టులో కొడాలి నానికి స్వల్ప ఊరట

- గత ప్రభుత్వం హయాంలో చంద్రబాబు, లోకేశ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ నానిపై ఫిర్యాదు
- విశాఖ త్రీ టౌన్ పీఎస్ లో కేసు నమోదు
- కేసు కొట్టివేయాలంటూ హైకోర్టులో కొడాలి నాని క్వాష్ పిటిషన్
- విచారణ చేపట్టిన న్యాయస్థానం




**పెన్ పవర్ డెస్క్:**కూటమి ప్రభుత్వం వచ్చాక వివిధ కేసులు ఎదుర్కొంటున్న వైసీపీ నేతలు అరెస్ట్ భయంతో కోర్టులను ఆశ్రయిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు, నారా లోకేశ్ లపై సోషల్ మీడియాలో

వివరాలు 2లో..

### నన్ను ఎంతో అవమానించారు... కష్టపెట్టారు...

## వారిని పక్కన పెట్టకపోతే జగన్ కు భవిష్యత్తు ఉండదు



- చుట్టూ ఉన్న కోటరీతో జగన్ నష్టపోతున్నారన్న విజయసాయిరెడ్డి
- మళ్లీ వైసీపీలో చేరనని స్పష్టీకరణ
- విరిగిన మనసు మళ్లీ అతుక్కోదని వ్యాఖ్య
- వైసీపీలోనే ఉండాలని జగన్ కోరినా ఒప్పుకోలేదన్న విజయసాయి
- జగన్ బాగుండాలనే తాను కోరుకుంటున్నానని వ్యాఖ్య

వివరాలు 2లో..

## మోహన్ బాబు గురించి వస్తున్న వార్తల్లో నిజం లేదు

### సినీ నటి సౌందర్య భర్త

- సౌందర్య ఆస్తులను మోహన్ బాబు స్వాధీనం చేసుకోలేదన్న రఘు
- తమ మధ్య ఎలాంటి ఆస్తి లావాదేవీలు లేవని వెల్లడి
- ఇప్పటికీ ఆయనతో తమకు మంచి స్నేహం ఉందని వ్యాఖ్య




**పెన్ పవర్ డెస్క్:**సినీ నటి సౌందర్యకు సంబంధించి నటుడు మోహన్ బాబుపై పలు వార్తలు ఇటీవలి కాలంలో తెరపైకి వస్తున్నాయి. సౌందర్య మరణం ప్రమాదవశాత్తు జరిగింది కాదని... ఆమెను పక్కాగా ప్లాన్ చేసి చంపేశారంటూ ఖమ్మం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి ఇటీవల నిరసనకు దిగారు. మోహన్ బాబుపై సంచలన

వివరాలు 2లో..

## జనసేన ఆవిర్భావ సభకు నామకరణం చేసిన పవన్...

- మార్చి 14న జనసేన పార్టీ ఆవిర్భావ సభ
- పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ వద్ద సభ
- భారీ ఏర్పాట్లు చేస్తున్న జనసేన




**పెన్ పవర్ డెస్క్:**ఈ నెల 14న జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభకు 'జయకేతనం' అని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నామకరణం చేశారు. ఈ విషయాన్ని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ వద్ద జనసేన పార్టీ నిర్వహిస్తున్న 'జయకేతనం' సభ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని

వివరాలు 2లో..

## టీచర్లకు ఇక యాప్ ల భారం ఉండదు

- ఉపాధ్యాయులపై కేసుల ఎత్తివేతకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని వెల్లడి
- 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారన్న లోకేశ్
- జీవో 117 రద్దుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టీకరణ
- ఏప్రిల్ 24 తరువాత కొత్త ఫీజు రీయింబర్స్ మెంట్ విధానం అమలు



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణలపై శాసనమండలిలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ చర్చలో భాగంగా విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. ఇకపై ఏపీలో టీచర్లకు యాప్ ల భారం ఉండదని

వివరాలు 2లో..

## ఏపీ హైకోర్టులో పోసానికి ఎదురుదెబ్బ




- పోసానిపై సీఐడీ పీటీ వారెంట్
- పీటీ వారెంట్ కొట్టేయాలంటూ హైకోర్టులో పోసాని లంచ్ మోషన్ పిటిషన్
- పోసాని లంచ్ మోషన్ పిటిషన్ కొట్టివేసిన న్యాయస్థానం

వివరాలు 2లో..



## తెలంగాణలో మండే ఎండలు... అవసరం అయితేనే జనం బయటకు రండి..!

**పెన్ పవర్ డెస్క్:** మార్చి 13 నుంచి తెలంగాణలో ఎండలు కాక పుట్టించనున్నాయి. వేడి గాలులతో, వడగాల్పులతో వాతావరణం మార్చిలోనే మే నెల ఎండలను తలపించనుంది. హైదరాబాద్ నగరంలో పగటి పూట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానున్నాయి. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, యాదాద్రి, మెదక్, సిద్ధిపేట్, సిరిసిల్ల, కామారెడ్డి, జనగామ, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# సురక్షిత మంచినీరు ఎండమావేనా

భూమి మీద వృక్షాలు, జంతువులు మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. ఇది ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపురూపమైన పదార్థం. ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు నీరు ప్రాణాధారం. తొలి జీవిపుట్టుక నీటితోనే జరిగింది. తాగునీరు అరుదైన వస్తువుగా మారింది. గ్రామాల్లో, పట్టణాల్లో నివసించే కోట్లాది ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసే ప్రక్రియ సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నాయి పలు దేశాలు. అధిక జనాభా కలిగిన భారతదేశం కూడా స్వచ్ఛమైన తాగు నీరు అందించలేకపోవడంతో అతిపెద్ద సమస్యగా రూపుదాల్చింది.దేశంలోని 80% జనాభా మంచినీళ్ల రూపంలో విషం తాగుతున్నారు. ఆ విషయాన్ని ఇండియన్ పార్లమెంట్ సాక్షిగా బయటపెట్టారు. దిగ్భ్రాంతి కలిగించేలా రాజ్యసభ చెప్పిన లెక్కల ప్రకారం దాదాపు భారతదేశ జనాభా విషపూరిత మంచినీళు తాగుతున్నారు. అన్ని రాష్ట్రాల్లోని భూగర్భ జలాల్లో విషపూరిత లోహాలు అధికంగా ఉన్నట్లు వెల్లడించింది. దేశజనాభాలో 80 శాతానికి పైగా ప్రజలు భూమినుండి నీటిని పొందుతున్నారు. భూగర్భ జలాల్లో ప్రమాదకర లోహాలు నిర్దేశిత ప్రమాణాన్ని మించి ఉన్న నీళ్లను తాగుతున్నారని జల్‌శక్తి మంత్రిత్వ శాఖ చెబుతోంది. తాగునీటి వనరులు కలుషితమై ఉన్న నివాస ప్రాంతాల సంఖ్యను రాజ్యసభ బయటపెట్టింది.ఆ నివేదిక ప్రకారం 671 ప్రాంతాలు ఫ్లోరైడ్, 814 ప్రాంతాలు ఆర్సెనిక్, 14,079 ప్రాంతాలు ఇనుము, 9,930 ప్రాంతాలు లవణీయత, 517 ప్రాంతాలు నైట్రేట్, 111 ప్రాంతాలు భారీ లోహాలతోఉన్న భూగర్భజలాలు ఉన్నాయని వివరించింది. భూగర్భ జలాల్లోని విషం నగరాల కంటే గ్రామాలలో చాలా తీవ్రంగా ఉంది. గ్రామాల్లో తాగునీటికి ప్రధాన వనరులు. చేతి పంపులు, బావులు, నదులు లేదా చెరువులు. సాధారణంగా గ్రామాల్లో ఈ నీటిని శుభ్రం చేయడానికి మార్గంలేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు విషపూరితమైన నీటిని తాగాల్సి వస్తోందని రాజ్యసభ వెల్లడించింది. ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను ఆగస్టు 2019లో ప్రారంభించినట్లు లోక్‌సభకు తెలిపింది. దీని కింద 2024 నాటికి ప్రతి గ్రామీణ ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయాలి. ప్రభుత్వం ఇచ్చిన డేటా ప్రకారం ఇప్పటివరకు 9.81 కోట్ల కుటుంబాలకు కుళాయి నీటిని సరఫరా చేస్తున్నారు. ఇది కాకుండా, అమృత్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 2021లో ప్రారంభించింది. దీనికింద వచ్చే 5 సంవత్సరాలలో అంటే 2026 నాటికి అన్ని నగరాలకు కుళాయి నీటిని సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని రాజ్యసభ వేదికగా ప్రభుత్వం చెబుతోంది. నీరు రాష్ట్రానికి సంబంధించిన అంశమని, ప్రజలకు తాగునీరు అందించాల్సిన బాధ్యత రాష్ట్రాలదేనని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు వేదికగా తెలపడం గమనార్హం. అయితే కేంద్ర ప్రభుత్వం కూడా స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అనేక పథకాలు అమలు చేస్తోందని వివరించింది.దేశవ్యాప్తంగా జనాభా తాగుతున్న విషపూరిత మంచి నీళ్ల గురించి రాజ్యసభ వేదికగా కేంద్రం చెప్పిన అంశాలు: 25 రాష్ట్రాల్లోని 209 జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల్లో లీటరుకు 0.01 మి.గ్రా కంటే ఎక్కువ ఆర్సెనిక్ ఉంటుంది. 29 రాష్ట్రాల్లోని 491 జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల్లో ఐరన్ లీటరుకు 1 మి.గ్రా కంటే ఎక్కువగా ఉంటుంది. 11 రాష్ట్రాల్లోని 29 జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల్లో కాడ్మియం లీటరుకు 0.003 మి.గ్రా కంటే ఎక్కువగా ఉంటుంది. 16 రాష్ట్రాల్లోని 62 జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల్లో క్రోమియం లీటరుకు 0.05 మి.గ్రా కంటే ఎక్కువగా ఉంటుంది. 18 రాష్ట్రాల్లోని 152 జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల్లో యురేనియం లీటరుకు 0.03 మి.గ్రా కంటే ఎక్కువగా ఉంటుంది. ఒక వ్యక్తి ప్రతిరోజూ సగటున 3 లీటర్ల నీరు తాగుతాడని సాధారణంగా నమ్ముతారు. ప్రభుత్వ పత్రాల ప్రకారం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ కనీసం 2 లీటర్ల నీరు తాగాలి. మీరు ప్రతిరోజూ 2 లీటర్ల నీరు తాగితే, కొంత మొత్తంలో విషం శరీరంలోకి ప్రవేశిస్తుంది. భూగర్భ జలాల్లోని ఆర్సెనిక్, ఇనుము, సీసం, కాడ్మియం, క్రోమియం, యురేనియం నిర్దేశిత ప్రమాణం కంటే ఎక్కువగా ఉండటం వల్ల మన ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అధిక ఆర్సెనిక్ అంటే చర్మవ్యాధులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అధిక ఇనుము అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి నాడీ వ్యవస్థకు సంబంధించిన వ్యాధులను సూచిస్తుంది. నీటిలో అధిక మొత్తంలో సీసం మన నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. అధిక స్థాయి కాడ్మియం మూత్రపిండాల వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందిఅధిక మొత్తంలో క్రోమియం చిన్న ప్రేగులలో వ్యాపించే హైపర్‌ప్లాసియాకు కారణమవుతుంది, ఇది కణితుల ప్రమాదాన్ని పెంచుతుంది. తాగే నీటిలో యురేనియం అధికంగా ఉండటం వల్ల కిడ్నీవ్యాధులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. మొత్తం మీద విషపూరిత మంచినీళ్లు తాగుతూ దేశజనాభా అనారోగ్యానికి గురవుతున్నారు. ఫలితంగా అనారోగ్య భారత్ దిశగా పాలకులు దేశాన్ని తీసుకెళుతున్న పరిస్థితి నెలకొంది. అరవై శాతం దేశజనాభా నీళ్లు లేక నానాయాతనలు పడుతున్నారని, ప్యూరిఫైడ్ వాటర్ అందక ఏటా దాదాపు రెండు లక్షల మంది చనిపోతున్నారని గతంలో నీతిఆయోగ్ వెల్లడించింది. 2030 నాటికి ఇప్పుడు ఉన్న నీటికి రెండింతల డిమాండ్ అవసరమవుతుందని అంచనా వేసింది.2030 నాటికి దేశ జనాభాలో 40 శాతం మందికి గొంతు తడుపుకోవడానికి నీళ్లే దొరకని పరిస్థితి వస్తుందని 'కాంపోజిట్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇండెక్స్ (సిడబ్ల్యుఎంఐ)' రిపోర్ట్ కూడా గతంలో వెల్లడించింది. మూడేళ్ల క్రితం నాటి నివేదిక ప్రకారం నీళ్లకు సంబంధించి దేశం డేంజర్ జోన్‌లో ఉంది. ఈ సంక్షోభం నుంచి బయటపడటానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరింది. యుద్ధప్రాతిపాదికన వాటర్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్‌ను పక్కాగా అమలు చేయాలని సూచించింది. మంచినీళ్లు దొరక్కపోవడంతో చాలా మంది కలుషిత నీళ్లనే తమకు తెలిసిన పద్ధతిలో శుద్ధి చేసుకుని తాగుతున్నారు. దీంతో ప్రతి ఏడాది రెండు లక్షల మంది కలుషిత నీళ్లు తాగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అడుగంటిపోతున్న గ్రౌండ్ వాటర్‌ను సిడబ్ల్యుఎంఐ సీరియస్‌గా తీసుకుంది. గ్రౌండ్ వాటర్‌ను అదే విధంగా వ్యవసాయానికి అవసరమైన నీళ్లను పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.

## నన్ను ఎంతో అవమానించారు... కష్టపెట్టారు... వారిని పక్కన పెట్టకపోతే జగన్ కు భవిష్యత్తు ఉండదు

**పెన్ పవర్ డెస్క్:**కాకినాడ పోర్టు వాటాలను బలవంతంగా బదిలీ చేయించుకున్నారన్న కేసులో నిందితుడిగా ఉన్న మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సీఐడీ విచారణ ముగిసింది. విచారణ అనంతరం ఆయన మీడియాలో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో ఎదగడానికి తనను కొందరు కిందకు లాగారని ఆయన అన్నారు. వైసీపీ అధినేత జగన్ చుట్టూ ఉన్న కోటరీ కారణంగా ఆయనకు తీవ్ర నష్టం జరుగుతోందని చెప్పారు. కోటరీ నుంచి బయటకు రాకపోతే జగన్ కు రాజకీయ భవిష్యత్తు ఉండదని అన్నారు.తన మనసులో జగన్ కు సుస్థిరమైన స్థానం ఉందని విజయసాయి చెప్పారు. జగన్ మనసులో మాత్రం తనకు స్థానం లేదని... అందుకే తాను పార్టీ నుంచి బయటకు వచ్చేశానని తెలిపారు. కోటరీ వల్లే తాను జగన్ కు దూరమయ్యానని చెప్పారు. కోటరీ మాటలు వినొద్దని జగన్ కు స్పష్టంగా చెప్పానని తెలిపారు. భవిష్యత్తుల్లో మళ్లీ వైసీపీలో చేరే అవకాశమే లేదని స్పష్టం చేశారు. విరిగిపోయిన మనసు మళ్లీ అతుక్కోదని అన్నారు. ఏ పార్టీలో చేరాలనేదానిపై తాను ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు.

నాయకుడు అనేవాడు చెప్పుడు మాటలు వినకూడదని విజయసాయి అన్నారు. చెప్పుడు మాటలు వింటే... ఆ నాయకుడే కాదు... ప్రజలు, పార్టీ కూడా నష్టపోకతప్పదని చెప్పారు. తనకు, జగన్ మధ్య కొందరు విభేదాలు సృష్టించారని తెలిపారు. కోటరీకి అనుకూలంగా ఉంటేనే జగన్ వద్దకు తీసుకెళతారని చెప్పారు. జగన్ వద్దకు ఎవరినైనా తీసుకెళ్లాలంటే... కోటరీకి లాభం చేకూర్చాల్సి ఉంటుందని తెలిపారు. జగన్ బాగుండాలనే పార్టీ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా తాను కోరుకుంటున్నానని అన్నారు. కోటరీ నుంచి బయట పడకపోతే జగన్ భవిష్యత్తు కష్టంగా ఉంటుందని చెప్పారు. "సార్... మీ మనసులో నాకు స్థానం లేదు. మీ మనసులో స్థానం లేనప్పుడు నేను పార్టీలో ఉండలేను. ఎవరు నిజాలు చెబుతున్నారో... ఎవరు అబద్ధాలు చెబుతున్నారో అర్థం చేసుకోండి. కోటరీ నుంచి బయటపడండి" అని జగన్ తో తాను మాట్లాడినప్పుడు ఆయనకు స్పష్టంగా చెప్పానని విజయసాయి తెలిపారు. పార్టీలో తనకు ఎన్నో పదవులు ఇచ్చారని... దీన్ని తాను కాదనడంలేదని చెప్పారు. కానీ, తనను ఎన్నో విధాలుగా అవమానించారని, కష్టపెట్టారని... తన మనసు విరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో ఉండాలని జగన్ తనను కోరినప్పటికీ తాను ఒప్పుకోలేదని చెప్పారు.

## ఏపీ హైకోర్టులో పోసానికి ఎదురుదెబ్బ

**పెన్ పవర్ డెస్క్:**సీఐడి పీటీ వారెంట్‌కు బ్రేక్ వేయాలన్న పోసాని కృష్ణమురళి ప్రయత్నం విఫలమైంది. ఆయన దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్ ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. సీఐడీ పీటీ వారెంట్ ను రద్దు చేయాలన్న ఆయన విజ్ఞప్తిని ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. హైకోర్టు నిర్ణయంతో పోసాని తీవ్ర నిరాశకు గురయ్యారు. పోసానిని ఇప్పటికే పీటీ వారెంట్‌పై కర్నూలులో అదుపులోకి తీసుకున్నామని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలియజేశారు. ఆయన్ని మంగళగిరి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచేందుకు కర్నూలు నుంచి తీసుకువస్తున్నట్టు పీపీ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి పోసాని పిటిషన్‌ను కొట్టివేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# జనసేన ఆవిర్భావ సభకు నామకరణం చేసిన పవన్...

- మొదటి పేజీ తరువాయి

నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి జనసైనికులు, వీర మహిళలు తరలిరానున్నారని... ఇతర రాష్ట్రాల నుంచి కూడా జనసైనికులు, ముఖ్యంగా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుల నుంచి సైతం పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జరిగే ఈ సభ స్థానిక చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా ఉంటుందని మనోహర్ తెలిపారు. ఈ ప్రాంతానికి విశేష సేవలందించిన మహానుభావులను స్మరించుకునే విధంగా మూడు ముఖద్వారాలకు వారి పేర్లు పెట్టామని ఆయన వెల్లడించారు. తొలి ద్వారానికి పిఠాపురం మహారాజు శ్రీ రాజా సూర్యరావు బహదూర్ పేరు పెట్టామని తెలిపారు. ఆయన విద్యాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు ఎనలేని కృషి చేశారని వివరించారు.

రెండవ ద్వారానికి రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులకు సహాయం చేసిన దొక్కా సీతమ్మ పేరు పెట్టామని వెల్లడించారు. ఇక మూడవ ద్వారానికి విద్యాసంస్థలు స్థాపించి చరిత్ర సృష్టించిన మల్లాది సత్యలింగం నాయకర్ పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ ముగ్గురు మహానుభావులు ఆయా ప్రాంతాలకు చేసిన సేవలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మనోహర్ పేర్కొన్నారు.భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు జనసేనకు అఖండ విజయాన్ని అందించారని మనోహర్ అన్నారు. పోటీ చేసిన ప్రతి స్థానంలో జనసేన విజయం సాధించిందని, ఇది జనసైనికులు, వీర మహిళలు, నాయకుల నిస్వార్థ సేవలకు ఫలితమని ఆయన కొనియాడారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని, పవన్ కళ్యాణ్ గారికి కృతజ్ఞతలు తెలుపుతూ, పిఠాపురం ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసేందుకు ఈ సభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్చి 14న జరిగే ఈ సభలో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని ఆయన వివరించారు.

# మోహన్ బాబు గురించి వస్తున్న వార్తల్లో నిజం లేదు

- మొదటి పేజీ తరువాయి

ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించి ఫిర్యాదు కూడా చేశారు. హైదరాబాద్ జల్ పల్లిలో ఉన్న ఫామ్ హౌస్ ని కూడా తన అదుపులో ఉంచుకుని మోహన్ బాబు అనుభవిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సౌందర్య భర్త రఘు స్పందించారు. హైదరాబాద్ లోని ఒక ప్రాపర్టీ గురించి మోహన్ బాబు పేరును అనవసరంగా ప్రస్తావిస్తున్నారని రఘు చెప్పారు. ఆ వార్తలన్నీ అవాస్తవాలేనని అన్నారు. తన భార్య సౌందర్య ఆస్తులను మోహన్ బాబు చట్ట విరుద్ధంగా స్వాధీనం చేసుకోలేదని చెప్పారు. మోహన్ బాబుకు, తమకు మధ్య ఎలాంటి ఆస్తి లావాదేవీలు లేవని అన్నారు. తన భార్య, అత్త, బావమరిది ఆయనతో మంచిగా ఉండేవారని తెలిపారు. సౌందర్య మరణించిన తర్వాత కూడా... ఆయనతో తమకు మంచి స్నేహం ఉందని చెప్పారు. మోహన్ బాబుపై అసత్య వార్తలు వస్తున్న నేపథ్యంలోనే

తాను అసలు విషయాలు ఏమిటో చెప్పాలనుకున్నానని తెలిపారు. ఇలాంటి తప్పుడు కథనాలను ప్రచురించవద్దని కోరారు. సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పని చేస్తున్న రఘును 2003లో సౌందర్య పెళ్లి చేసుకున్నారు. 2004లో హెలికాప్టర్ ప్రమాదంలో ఆమె దుర్మరణం చెందారు. 2004 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ తరపున సౌందర్య ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారం కోసం బెంగళూరు నుంచి కరీంనగర్ కు బయల్దేరిన వెంటనే హెలికాప్టర్ క్రాష్ అయింది. ఈ ప్రమాదంలో ఆమె సజీవదహనం అయ్యారు.

# ఎప్పుడూ మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- మొదటి పేజీ తరువాయి

18 ఏళ్ల తర్వాత ఆ డబ్బులను కానుకగా ఇచ్చామని తెలిపారు. 8, 9, 10 తరగతి విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశామని, ప్రతిభా భారతికి స్పీకర్‌గా అవకాశం ఇచ్చి మహిళలందరినీ గౌరవించామని అన్నారు. ప్రస్తుతం దేశ రాష్ట్రపతి, ఆర్థిక మంత్రి మహిళలేనని, తమ ప్రభుత్వంలో ముగ్గురు మహిళా మంత్రులు ఉన్నారని, 175 ఎమ్మెల్యే స్థానాల్లో 21 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారని పేర్కొన్నారు.ఎన్టీఆర్ 8 శాతంతో మొదలుపెట్టిన మహిళా రిజర్వేషన్లను తాను 33 శాతానికి చేర్చానని, ఇటీవల చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం లభించిందని చంద్రబాబు అన్నారు. రిజర్వేషన్లు అమలైతే చట్టసభకు 75 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉంటారని తెలిపారు. కట్టెల పొయ్యిపై తన తల్లి పడుతున్న కష్టం చూసి దీపం పథకం తెచ్చానని, దేశంలో అత్యధికంగా 65 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, దీపం 2 కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు.

పసుపు కుంకుమ కింద ఒక్కో డ్వాక్రా మహిళకు రూ. 10 వేల చొప్పున రూ.9,689 అందించామని, స్త్రీ నిధి కింద రూ. 4,440 కోట్ల ఆర్థిక సాయం చేశామని గుర్తు చేశారు. తల్లిబిడ్డా ఎక్స్‌ప్రెస్, ఎన్టీఆర్ బేబీ కిట్స్, తల్లికి వందనం, అన్న అమృత హస్తం, బాలామృతం, బాలికలకు రక్ష, పెళ్లికానుక, గిరి గోరుముద్దలు, ఫుడ్ బాస్కెట్, మహిళలకు 11 రకాల ఉచిత వైద్య పరీక్షలు, మహిళల గౌరవాన్ని కాపాడేందుకు మరుగుదొడ్లు, సామూహిక శ్రీమంతాలు నిర్వహించామని తెలిపారు.

2014-2019 మధ్య డ్వాక్రా మహిళలకు రూ. 8,500 కోట్లు రుణమాఫీ చేశామని, ఈ 9 నెలల్లో 7,338 స్వయం సహాయక సంఘాలను, 18 జిల్లా అర్బన్ సమాఖ్యలను ఏర్పాటు చేశామని చంద్రబాబు అన్నారు. 4,91,221 మంది డ్వాక్రా గ్రూపులకు రూ.4,217 కోట్ల స్త్రీ నిధి రుణాలు ఇచ్చామని, బ్యాంకు లింకేజీ ద్వారా 51 లక్షల మందికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.29,486 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో రూ. ఒక లక్షా 4 వేల 578 కోట్లు, మెప్మా గ్రూపులకు రూ. 13,860 కోట్లు ఇచ్చామని చెప్పారు.

వచ్చే ఏడాదికి 15 వేల కోట్ల రుణాలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని, సెర్ప్ కింద డ్వాక్రాలో గ్రామీణ ప్రాంతాల్లో 8 లక్షల 48 వేల 497 సంఘాలు ఉండగా, వీటిలో 88 లక్షల 31 వేల 116 మంది సభ్యులు ఉన్నారని, వారంతా రూ. 33 వేల 942 కోట్లు రుణాలు తీసుకున్నారని, వచ్చే ఏడాదికి రూ. 50 వేల కోట్లు రుణాలు టార్గెట్ పెట్టుకున్నామని తెలిపారు.

సఖి నివాస్ కింద 23 వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు ఏర్పాటు చేశామని, 4,500మంది అందులో నివాసం ఉంటున్నారని, పబ్లిక్ ప్లేస్‌లలో 304 బేబీ ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామని, 5 లక్షల 544 మందికి బాల సంజీవని పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా కుట్టు మిషన్లు, బ్యూటీ థెరపీ, నర్సింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ట్రైనింగ్ ఇస్తున్నామని చెప్పారు.63 లక్షల 36 వేల 932 మందికి పెన్షన్లు ఇస్తుండగా, అందులో 50 శాతంపైగా మహిళలేనని తెలిపారు. 37 లక్షల 39 వేల 522 మంది మహిళలు పెన్షన్లు అందుకుంటున్నారని, ఒక్క మహిళలకే పెన్షన్ల కింద నెలకు రూ.1,543 కోట్లు ఖర్చు చేస్తున్నామని అన్నారు. లక్షా 77 వేల 523 మంది ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇస్తున్నామని, గతంలో ఎవ్వరూ ఇలా ఇవ్వలేదని, భర్త చనిపోతే వితంతు పెన్షన్ అందేది కాదని, ఒంటరి మహిళలకు అండగా నిలబడాలనే ఉద్దేశంతో వితంతు పెన్షన్లు ప్రవేశపెట్టామని తెలిపారు.మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేసేందుకు 24 సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామని, వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తులపై డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇవ్వడానికి ఒప్పందం జరిగిందని, అమూల్ వలే మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు ఒక బ్రాండ్ తీసుకొచ్చి ప్రమోట్ చేస్తే అంతర్జాతీయంగా మంచి పేరు వస్తుందని చంద్రబాబు అన్నారు. మన ఆడబిడ్డలు తయారుచేసే ఉత్పత్తులు ప్రపంచంలోని అన్ని మార్కెట్లలో పెడతామని, బనానా ఫైబర్ తో బ్యాగులు, శారీస్, బొమ్మలు తయారు చేస్తున్నారని, గుర్రపు డెక్కతో కూడా బ్యాగులు తయారు చేస్తూ సంపద సృష్టిస్తున్నారని తెలిపారు.ర్యాపిడోతో ఒప్పందం చేసుకున్నామని, వెయ్యి ఎలక్ట్రిక్ వాహనాలను మహిళలే నడపనున్నారని, దీని ద్వారా మహిళలకు అదనపు ఆదాయం వస్తుందని, హెూమ్ ట్రయాంగిల్ యాప్ ద్వారా మహిళలకు ఆన్ లైన్ ట్రైనింగ్ ఇప్పిస్తామని, నేషనల్ అప్రన్ షిప్ స్కీమ్ కింద 25 వేలమందికి ఎంపిక చేసి శిక్షణ ఇప్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, అలీప్ సంస్థ విజయవాడ, అనాకపల్లి, కుప్పంలో ఇండస్ట్రియల్ పార్క్ పెట్టనున్నారని, లక్షా 50 వేల మందికి కుట్టుమిషన్లు ఇప్పిస్తున్నామని అన్నారు.చివరగా, మహిళా భద్రత, హక్కులు, గౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, మారుమూల పల్లెలో ఉండే ఆడబిడ్డ పట్టణాలకు వచ్చి గౌరవంగా ఉద్యోగం చేసుకునేలా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# టీచర్లకు ఇక యాప్ ల భారం ఉండదు

- మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేశారు. ఉధ్యాయులపై గతంలో పెట్టిన కేసులను ఎత్తివేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం విద్యాశాఖను నిర్లక్ష్యం చేసిందని, దాని ఫలితంగానే విద్యార్థులు నైపుణ్యాలను కోల్పోయారని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న సమస్యలను పరిష్కరించి, రాబోయే నాలుగేళ్లలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని, దీనికి ప్రధాన కారణం జీవో 117 అని లోకేశ్ పేర్కొన్నారు. ఈ జీవో కారణంగానే అనేక పాఠశాలలు మూతపడ్డాయని, సింగిల్ టీచర్ పాఠశాలల సంఖ్య పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, గత ప్రభుత్వం రికార్డులను తారుమారు చేసిందని, డ్రాప్ బాక్స్ వ్యవస్థ ద్వారా లక్షల మంది విద్యార్థుల వివరాలను తప్పుగా చూపించారని ఆరోపించారు. దీనివల్ల డ్రాపౌట్ రేటు 12.5%కి పెరిగిందని తెలిపారు. నాడు-నేడు కార్యక్రమం కింద చేపట్టిన పనులకు నిధులు విడుదల చేస్తామని, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ఆక్స్ ఫర్డ్ డిక్షనరీ, నోట్ బుక్స్, చిక్కీలు, గుడ్లు వంటి వాటిపై గత ప్రభుత్వం నాయకుల ఫోటోలు వేసుకుందని విమర్శించారు. ప్రస్తుతం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్కూల్ కిట్లు అందిస్తున్నామని, వాటిపై ఎలాంటి రాజకీయ రంగులు, నాయకుల ఫోటోలు ఉండవని స్పష్టం చేశారు. పాఠశాలల్లో పిల్లల పుస్తకాల బరువు తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నామని, సెమిస్టర్ విధానంలో మొదటి సెమిస్టర్ కు రెండు పుస్తకాలు, రెండో సెమిస్టర్ కు రెండు పుస్తకాలు చొప్పున అందిస్తామని తెలిపారు. సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేయడానికి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామని వెల్లడించారు. టోఫెల్ విధానం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని, ఐబీ స్కూల్స్ కోసం గత ప్రభుత్వం రూ.5 కోట్లు వృథా చేసిందని ఆరోపించారు. ఉన్నత విద్యారంగంలోనూ సంస్కరణలు తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని లోకేశ్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 3,282 పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే రిక్రూట్ మెంట్ ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయాలకు ఒక యూనిఫైడ్ చట్టం తీసుకువస్తామని, తద్వారా వాటి కార్యకలాపాల్లో మరింత పారదర్శకత ఉంటుందని చెప్పారు. నూతన విద్యా విధానంలో భాగంగా డీప్ టెక్ యూనివర్సిటీ, ఇండియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, స్పోర్ట్స్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. చివరగా, విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అందరూ సహకరించాలని మంత్రి లోకేశ్ కోరారు.

## చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి పోలీసుల నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

స్థానం నుంచి చెవిరెడ్డి పోటీ చేశారు.

ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఎర్రగొండపాలెంలో మూడు కేసులు, పెద్దారవీడు, దోర్నాలలో ఒక్కొక్క కేసు నమోదయ్యాయి. ఒంగోలు వైసీపీ కార్యాలయంలో చెవిరెడ్డికి పోలీసులు నోటీసులు అందించారు. ఈ కేసుల్లో యర్రగొండపాలెం ఆర్వో శ్రీలేఖను బెదిరించిన కేసు కూడా ఉంది.

## మే నుంచి 'తల్లికి వందనం'.. ఎంతమంది పిల్లలున్నా అకౌంట్లోకి డబ్బులు

- మొదటి పేజీ తరువాయి

2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో బాబు సూపర్ 6ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ 'తల్లికి వందనం' పథకం కూడా సూపర్ సిక్స్?లో ఒకటి కావడం గమనార్హం. ఈ పథకం ఇప్పటికీ అమలు చేయకపోవడంపై కూటమి ప్రభుత్వంపై వైసీపీ తీవ్ర విమర్శలు చేసింది. విద్యార్థుల తల్లులను బాబు ప్రభుత్వం మోసం చేసిందని, బూటకపు హామీలతో కూటమి పార్టీలు అధికారం దక్కించుకున్నాయని వైసీపీ నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. మే నెలలో 'తల్లికి వందనం' ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో అమలుపై ఏపీ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతూ ఉంటే.. అంతమంది పిల్లలకు సంవత్సరానికి తలో రూ.15 వేలు ఇస్తామని బాబు సూపర్ సిక్స్?లో ప్రముఖంగా ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఏపీలో కూటమి అధికారంలోకి రావడంలో ఈ హామీ కూడా కీలక పాత్ర పోషించింది.

## మారిషస్ దేశ అత్యున్నత పురస్కారం అందుకున్న ప్రధాని మోదీ

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ మారిషస్ పర్యటన కొనసాగుతోంది. మోదీకి మారిషస్ దేశ అత్యున్నత జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. ఈ విశిష్ట పురస్కారాన్ని తాను వినమ్రంగా స్వీకరిస్తున్నానని, మారిషస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని మోదీ పేర్కొన్నారు. మారిషస్ సోదర సోదరీమణులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అంటూ సందేశం ఇచ్చారు. ఇది నా ఒక్కడికి లభించిన పురస్కారంగా భావించడంలేదని, 140 కోట్ల మంది భారతీయులకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని మోదీ పేర్కొన్నారు. కాగా, మారిషస్ రాజధాని పోర్ట్ లూయిస్ లో మోదీకి నిన్న ఘన స్వాగతం లభించింది. మారిషస్ ప్రధాని నవీన్ రామ్ గులామ్ స్వయంగా ఎయిర్ పోర్టుకు వచ్చి భారత ప్రధానికి స్వాగతం పలకడం విశేషం.

## ప్రతి కార్యకర్తకి అండగా ఉంటా

- మొదటి పేజీ తరువాయి

రూ. 700 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకుందని మండిపడ్డారు. పిల్లలకు కేటాయింపులు చేయాల్సింది పోయి వారిని ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో ఏ పార్టీ చేయనంత సంక్షేమం, అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం అందించిందని అన్నారు. ఈరోజు నిర్వహిస్తున్న పోరుబాటలో పాల్గొంటున్న యువత, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. ఇన్నేళ్లుగా వైసీపీతో కలిసి నడుస్తున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## ఏపీ హైకోర్టులో కొడాలి నానికి స్వల్ప ఊరట

- మొదటి పేజీ తరువాయి

అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదు మేరకు గత నవంబరులో మాజీ ఎమ్మెల్యే కొడాలి నానిపై విశాఖ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. అయితే, ఈ కేసును కొట్టి వేయాలంటూ కొడాలి నాని ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఆ మేరకు క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం కొడాలి నానికి స్వల్ప ఊరటనిచ్చింది. తొందరపాటు చర్యలు వద్దని, 35(3) సెక్షన్ కింద నోటీసులు ఇచ్చి వివరాలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది.

## తెలంగాణలో మండే ఎండలు... అవసరం అయితేనే జనం బయటకు రండి..!

- మొదటి పేజీ తరువాయి

జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానుంది.ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నారాయణ్ పేట్, వనపర్తి, గద్వాల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతుందని వాతావరణ శాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. వేసవికాలం ప్రారంభమైన మొదట్లోనే టెంపరేచర్ 40 డిగ్రీలకు చేరువలో ఉంది. మరో రెండు నెలలు వేసవి కాలం ఉండడంతో ప్రస్తుత ఉష్ణోగతలను చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. గత మూడునాలుగు రోజుల నుంచి సూర్యాపేట జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో 38 డిగ్రీలకు పైగా, 10 ప్రాంతాల్లో 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరుబావుల్లో నీరు తగ్గిపోయి పంటలు ఎండిపోతున్నాయి.ఏప్రిల్, మే నెలల్లో సాధారణంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ మార్చి రెండో వారంలోనే 35 డిగ్రీలకు చేరుకొని ఆ తర్వాత 40కి అటు ఇటుగా నమోదవుతుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మార్చి 4న 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అంతకుముందు వారం రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ఈనెల 1న 33 డిగ్రీలు, 2న 35 డిగ్రీలు, 3న మరో రెండు డిగ్రీలు పెరిగి 37కు చేరింది. ఈనెల 4న ఏకంగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం నాలుగు మండలాల్లో 38.03 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఎండాలను చూస్తున్న జనం రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పై దృష్టి పెట్టాలి

## - జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా







**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 12**

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడం పై ప్రత్యేక దృష్టి పట్టాలని జిల్లా కలెక్టరు ఏ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. మార్కెట్లు, దుకాణాల వద్ద ఇందుకు అవసరమైన ప్రత్యామ్నాయాలు కల్పించాలని చెప్పారు. బుధవారం అమరావతి సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్రా ఈనెలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగి కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ, ప్రభుత్వ సేవలు ప్రజలకు సమర్ధంగా అందిచడం - పి-4 పై ఆయన సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టరు ఆర్ గోపాలకృష్ణతో కలిసి తన క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టరు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. సిఎస్ సమీక అనంతరం ఆయా అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని సమర్ధంగా నిషేదించాలనే ఇతి వృత్తంతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కావున ఈ దిశగా ప్రజలలో విస్తృత అవగాహన కల్పించేలా వివిధ స్థాయిలలో ప్రజాప్రతినిధులను ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని కలెక్టరు దిశా నిర్దేశం చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడంతోపాటు వాటికి ప్రత్యామ్నాయంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే క్లాత్, జ్యూట్ సంచులను ప్రమోట్ చేయాలని చెప్పారు. ఈ నెల 24, 25 తేదీ లలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉన్నందున శాఖల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల లక్ష్యాలు- పురోగతి, జిల్లాల వారీగా ప్రత్యేక అంశాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు తయారు చేయాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఉన్నందున ఆయా పరీక్షా కేంద్రాలలో అవసరమైన వసతులు కల్పించడంతోపాటు భద్రతా పరంగా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ దిశగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. పెన్షన్ పంపిణీ, రెవెన్యూ మ్యుటేషన్లు కరెక్షన్లు, పారిశుద్ధ్యము ప్రతి రోజు చెత్త సేకరణ, ఆసుపత్రులు, దేవాలయాలలో ప్రజలకు అందించే సేవల విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని ప్రజలతో సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించేలా పర్యవేక్షించాలని ఆయా శాఖల ఉన్నతాధికారులకు కలెక్టరు స్పష్టం చేశారు. ఈ సమావేశం లో ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు,సిపిఓ డి. వెంకటేశ్వర్లు, జడ్పీ సిఇఓ చిరంజీవి,డిఎం అండ్ హెచ్ఓ టి. వెంకటేశ్వరు, డిసిహెచ్ఎస్ సూరిబాబు,డి.పి.ఓ జి. వెంకట నాయుడు, డీఆర్డీఏ ఏపిడి నారాయణ, డ్వామా పిడి వండర్ మాన్, సర్వే శాఖ సహాయ సంచాలకులు గౌస్ బాష, విద్య, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# పెన్ పవర్ ప్రకాశం

## ఈ అసెంబ్లీరెండోమారూ గళం విప్పిన ముత్తుముల అధ్యక్షా

*జగన్ రెడ్డి అసమర్ధత వల్లే ప్రజల పై ట్రూ అప్ చార్జీల భారం*

*లో వోల్టేజ్ సమస్యలను పరిష్కారం చేసి, నాణ్యమైన విద్యుత్ ను అందించిన ఘనత సీఎం చంద్రబాబుదే.*

*గ్రీన్ ఎనర్జీ, సోలార్ ద్వారా మిగులు విద్యుత్ -విద్యుత్ సంస్కరణల తెచ్చిందే సీఎం చంద్రబాబునాయుడు*

*9 సార్లు విద్యుత్ చార్జీల పెంచి ఘనత జగన్ దే -అసెంబ్లీలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల*





**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 12**

జగన్ రెడ్డి అసమర్థ పాలన వల్లే రాష్ట్ర ప్రజల పై ట్రూ అప్ చార్జీల భారం పడిందని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆరోపింస్తూ గత వైసీపీ పాలన పై అగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో జరిగిన విద్యుత్ సంస్కరణల పై ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడారు. గత వైసీపీ పాలనలో విద్యుత్ రంగాన్ని నష్టాల బాట పట్టించారని, సాంప్రదాయ విద్యుత్ ను ప్రోత్సహించకుండా థర్మల్ విద్యుత్ ను కొనుగోలు చేసి ట్రూ అప్ చార్జీల పేరుతో రూ. 15 వేల కోట్లు, డిస్కమ్ ల మీద అదనంగా రూ. 9 వేల కోట్లు, ఆర్థిక భారం రాష్ట్ర ప్రజల పై మోపాడని, 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత జగన్ రెడ్డి దేనన్నారు. అదే విధంగా రైతుల పేరు చెప్పి అధికారంలోకి వచ్చి రైతుల మోటార్లకు మీటర్లు బిగించి రైతులకు వెన్నుపోటు పొడిచారన్నారని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం ప్రజల పై ఎటువంటి విద్యుత్ చార్జీల భారం మోపలేదని, ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజల పై ఎటువంటి ఆర్థిక ఇబ్బందులున్న ఎస్సి, ఎస్టీలకు పీఎం సూర్య గర్ పథకం ద్వారా ఉచితంగా విద్యుత్ అందించే విధానానికి సీఎం చంద్రబాబు , విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవీకుమార్ లు శ్రీకారం చూట్టారన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్, మిగులు విద్యుత్ లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.. గ్రామ స్థాయిలో లైన్ మెన్ ల కొరతను భర్తీ చేయాలని స్పీకర్ ని కోరారు. లైన్ మెన్ లు లేక ప్రజలు ,రైతులు అనేకమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని త్వరితగతిన లైన్ మెన్ ల నియామకం చేపట్టాలని తమరి ద్వారా విద్యుత్ శాఖ మంత్రికి విన్నవిస్తున్నానన్నారు.


# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్య

- ప్రతి గ్రామంలో మోడల్ స్కూల్ ఏర్పాటు
- తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించండి
- నాణ్యమైన విద్యాబోధన ప్రభుత్వ లక్ష్యం
- రైతులకు యంత్ర పరికరాలు అందించండి
- రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలి
- వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండాలి
- పేదరికం లేని సమాజమే లక్ష్యంగా కృషి
- మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ
- ప్రాణాలు నిలిపే సంజీవని సీఎంఆర్ఎఫ్
- రూ.3కోట్ల26 లక్షలసీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించాం
- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు









**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 12**

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని దీనిలో భాగంగానే ప్రతి గ్రామంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు మొదటి ఎంపిక ప్రభుత్వ విద్యాసంస్థలే కావాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యాశాఖ, అగ్రికల్చర్, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రభుత్వ విద్యాసంస్థల్లో సీట్ల కోసం సిఫార్సు లేఖలు అవసరమయ్యే పరిస్థితిని తీసుకొస్తామని మంత్రి లోకేష్ ప్రకటించారంటే పాఠశాలలను ఏ విధంగా అభివృద్ధి చేస్తున్నారో అర్థం చేసుకోవాల్సిన ఉందన్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రతి గ్రామంలో మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి గ్రామంలో తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రజలకు అర్థమయ్యేలా ప్రభుత్వ విధానాన్ని తెలియజేయాలన్నారు. ప్రపంచం మొత్తం ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ ను సందర్శించేలా పాఠశాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

**రైతులకు యంత్ర పరికరాలు అందించండి...**

రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతుల ఉన్నతి కోసం అనుక్షణం పనిచేస్తుందన్నారు. రైతులు సాంకేతిక ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీపై ఆధునిక యంత్ర పరికరా లను అందిస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న యంత్ర పరికరాలను పథకాలను రైతాంగానికి వివరించాలని ఎమ్మెల్యే ఏలూరి ఆదేశిం చారు. అధికారులంతా సమన్వయం తో పనిచేసి ప్రతి పొలం గట్టు వద్దకు వెళ్లి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు అందించాలన్నారు.

**ఆర్థికంగా ఎదిగేలా భరోసా....**

పేద మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేదరికం లేని సమాజమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలకు రూపకల్పన చేసిందన్నారు. ప్రతి ఒక్కరిని లక్ష అధికారులు చేయడమే లక్ష్యంగా చంద్రబాబు విజన్ తో పనిచేస్తున్నారన్నారు. ఏడు నెలల కాలంలోనే అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేసి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పేదల స్వశక్తిపై ఎదిగేందుకు వారికి అండగా నిలిచేందుకు 50 వేల సబ్సిడీతో వివిధ పథకాలను అమలు చేశామన్నారు దీనిలో భాగంగా 14 లక్షల రుణాలను అందించినట్లు పేర్కొన్నారు. అవసరాలకు అనుగుణంగా వారి పరిజ్ఞానం మేరకు అనేక వడ్డీ లేని సబ్సిడీ రుణాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

**మహిళలకు టైలరింగ్ శిక్షణతో ఉపాధి...**

మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఎమ్మెల్యే ఏలూరి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో టైలరింగ్ ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాలను గుర్తించాలన్నారు. అవసరమైన వారందరికీ శిక్షణ ఇచ్చేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. అత్యధిక మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. మహిళల స్వశక్తిపై ఎదిగేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణా అనంతరం మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామన్నారు. ఎంపీడీవోలు శ్రీనివాసరావు ప్రద్యుమ్న, శ్రీనివాస్, శ్రీనివాసమూర్తి,కృష్ణ లు పాల్గొన్నారు.

**పేదలకు భరోసా సీఎంఆర్ఎఫ్....**

పర్చూరు నియోజకవర్గంలో అనారోగ్యంతో కార్పొరేట్ వైద్యం చేయించుకోలేని వేలాదిమందికి సీఎంఆర్ఎఫ్ భరోసాగా నిలిచిందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు 271 మందికి మూడు కోట్ల 23 లక్షలు అందజేసినట్లు ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. బుధవారం 26 మందికి 26 లక్షల సీఎంఆర్ ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ఏలూరి చేతుల మీదుగా అందజేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అనేక కుటుంబాలకు సీఎంఆర్ ఎఫ్ ఆసరాగా అండగా నిలిచిందన్నారు. పేదలకు వైద్యం అందించే ప్రాణాలు నిలిపే సంజీవినిగా సీఎంఆర్ఎఫ్ పనిచేసిందన్నారు.

**సమస్యలు వింటూ... పరిష్కారం చూపుతూ...**

ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలు వింటూ వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. పలువురు ప్రజలు అనేక సమస్యలను ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి తీసుకువచ్చారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చొరవ చూపారు.

## పొదిలిలో ఘనంగా వైయస్సార్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు





పొదిలి , పెన్ పవర్ మార్చి 12

పొదిలిలో బుధవారం నాడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా పట్టణంలోని పెద్ద బస్టాండ్ సెంటర్లో గల దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ కేక్ ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు అనంతరం ఒంగోలులో నిర్వహించ తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు సాని కొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, జి శ్రీనివాసులు, కల్లం వెంకట సుబ్బారెడ్డి, ఎండి ఫిరోజ్, రబ్బాని, మహబూబ్ బాషా, అశోక్ తో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## డీలర్ మాలకొండా రెడ్డి మృతి బాధాకరం



పీసీపల్లి పెన్ పవర్ మార్చి 12

లక్ష్మక్క పల్లి పంచాయతీ (డీలర్) బద్దెల మాలకొండా రెడ్డి అకాల మరణం చాలా బాధాకరం అని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి పిఏ ప్రసాద్ రెడ్డి అన్నారు . మాలకొండా రెడ్డి మరణవార్త విన్న ఆయన బుధవారం లక్ష్మక్కపల్లి స్వగ్రామానికి చేరుకొని మాలకొండా రెడ్డి పార్థీవ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించినారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి మాలకొండా రెడ్డి పెద్ద కుమారుడితో ఫోన్లో సంప్రదించి పెద్దాయన లేని లోటు చాలా బాధాకరమని , ఇలాంటప్పుడే ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు . ఉగ్ర పిఏ ప్రసాద్ రెడ్డి వెంట ఒంగోలు పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శి కోమటిగుంట్ల వీరయ్య, లక్ష్మక్క పల్లి పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు మూలే మాలకొండ రెడ్డి , చింతగుంపల్లి డీలర్ మల్లికార్జున్ రెడ్డి , పెద ఇర్లపాడుపాడు డీలర్ పోలు కొండారెడ్డి, దేశిరెడ్డి పల్లె డీలర్ తిరుపాల్ , వారి కుమారులు లక్ష్మణ్ రెడ్డి , గోపాల్ రెడ్డి మరియు తదితరులు ఉన్నారు.

## ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యా సదస్సును జయప్రదం చేయాలి

### సి.ఎస్.పురం మండలం ఏపీటీఎఫ్ శాఖ

చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 12

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై ఈనెల 14వ తేదీ శుక్రవారం గిద్దలూరులో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యా సదస్సు జరుగుతుందని కావున మండలంలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ తప్పకుండా పాల్గొని సదస్సు ను జయప్రదం చేయాలని ఏపిటిఎఫ్ సి యస్ పురం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జె యస్ ఆనంద్ బాబు జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ ఒక ప్రకటనలో కోరారు. ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యారంగం ఎదుర్కొంటున్న పలు సవాళ్లను ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో నిర్వహించవలసిన పాత్రను , ఏపీటీఎఫ్ అందించిన ఉద్యమ స్ఫూర్తిని, ఉద్యమ చరిత్రను నేటితరం ఉపాధ్యాయులకు తెలియపరచి చైతన్యపరిచే విధంగా ఈ విద్యా సదస్సు జరుగుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిథులుగా గిద్దలూరు శాసన సభ్యులు యం. అశోక్ రెడ్డి మునిసిపల్ చైర్మన్ మున్సిపల్ కమీషనర్ ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్. మంజుల పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాదరావు ఉపాధ్యాయ సంపాదకులు షేక్ జిలాని జిల్లా శాఖ అధ్యక్షులు వి.జనార్ధనరెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి శ్రీనివాసులు ఉపాధ్యాయ సంపాదకులు యస్. గురునాధశర్మ పూర్వ రాష్ట్ర కార్యదర్శులు ఐ. విజయసారధి బి.రఘు బాబు మరియు సీనియర్ నాయకులు ఫెడరేషన్ పక్షాన హాజరువుతున్నారని తెలిపారు కావున గిద్దలూరు విద్యాసదస్సు ను విజయవంతం చేయడానికి కార్యకర్తలు అందరు కృషి చేయాలని కోరారు.

# రైతులు పొలాల్లోపంట మార్పిడి చేయాలి

### ఒకే భూమిలో ఏటా ఒకే పంటను కాకుండావేరువేరు పంటలు పండించాలి

### ఎప్పుడు ఒకే పంట వేయటం అనర్థం మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ రెడ్డి






గిద్దలూరు పెన్ పవర్ మార్చి 12

అంబవరం, వెల్లుపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి " పంట మార్పిడి-ప్రయోజనాలు" గురించి తెలిపారు. ఒకే భూమిలో ఏటా ఒకే పంటను కాకుండా వేరువేరు పంటలు పండించడానికి పంట మార్పిడి అంటారు. ఒకే పంటను ఏళ్ల తరబడి పండించడం వలన చీడపీడలకు ఎల్లప్పుడూ ఆహారం సమృద్ధిగా లభించి వాటి ఉధృతి ఎక్కువగా అవుతుందన్నారు. ఆ విధంగా పంట మార్పిడి పాటించడం వలన పంటను ఆశించే కొన్ని రకాల చీడపురుగులను,తెగుళ్లను, సమస్యాత్మకంగా ఉన్న కలుపు మొక్కలను, నేల ద్వారా సంక్రమించే తెగుళ్ల వృద్ధిని అరికట్టవచ్చునన్నారు.సస్యరక్షణకు వాడే రసాయనిక మందుల ఖర్చులు తగ్గించవచ్చు. వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చునన్నారు. వివిధ రకాల వేరు వ్యవస్థలు భిన్నంగా పెరిగే పంటలను పంట మార్పిడి కోసం ఎంచుకోవాలి. ఇవి నేలలోని వివిధ పొరల్లో పోషకాలను తీసుకుంటాయి. కంది, పత్తి ఆముదం, పొద్దుతిరుగుడు వంటి పంటలు నేల లోపల పొరల నుంచి పోషకాలు తీసుకుంటాయి. పోషకాలను ఎక్కువగా తీసుకొనే నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలను, నెలలో పోషకాలు సమకూర్చే అపరాల పంటలతో పంట మార్పిడి చేయాలి. అపరాలు కరువు పరిస్థితులను తట్టుకుంటాయి. ఆకులను రాల్చి నెలకు సేంద్రియ పదార్థాలను అందజేస్తాయన్నారు. వేరు బుడిపెల ద్వారా వాతావరణంలోని నత్రజనిని నేలలో స్థిరీకరిస్తుంది. సూక్ష్మజీవుల చర్యల వల్ల ఎంజైములు ఉత్పత్తి పెరుగుతుంది అని రైతులకు తెలియజేశారు. ఉద్యాన శాఖ అధికారి పి.విష్ణు ప్రియ మాట్లాడుతూ ఉద్యాన శాఖలో అమలయ్యే వివిధ రకాల పథకాలు, సబ్సిడీ విధానాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్ రెడ్డి గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు శేఖర్, మహమ్మద్ నూర్ , రైతులు పాల్గొన్నారు.

## కుంచేపల్లిలో ఉచిత వైద్య శిబిరం





పొదిలి, పెన్ పవర్ మార్చి 12

మండలంలోని కుంచేపల్లి గ్రామంలో బుధవారం నాడు ఉచిత వైద్య శిబిరం జరిగింది ఆ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారి డాక్టర్ ఎం సుగున్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా అక్కడి ఇంటింటికి వెళ్లి ఫీవర్, మరియు లార్వా సర్వే నిర్వహించారు అలాగే గ్రామంలోని మురుగనీటి కాల్వల్లో మందు చల్లారు అలాగే అక్కడి ప్రజలకు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా లాంటి వ్యాధుల గురించి అవగాహన కలిగించారు అలాగే ప్రజలు రాత్రి వేళల్లో నిద్రించేటప్పుడు తప్పనిసరిగా దోమతెరలు వాడాలని ఆరోగ్య కేంద్రాధికారి సుగుణ కుమార్ సూచించారు అలాగే ఇళ్లతోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు ఉపయోగించిన కొబ్బరి బోండాలు గ్రామానికి దూరంగా పారవేయాలని సూచించారు అలాగే ఇళ్లలోని కూలర్లలో నీటిని ప్రతిరోజు మార్చుకోవాల్సిందిగా డాక్టర్ శుభం కుమార్ ప్రజలకు చెప్పారు అలాగే గ్రామంలోని ప్రజలకు ఆరోగ్య సూత్రాలను వివరించారు ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుగుణ కుమార్ తో పాటు సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణయ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తో పాటు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటైజర్ కార్మికుల వేతనాలు పెంచాలి -సిఐటియు






గిద్దలూరు పెన్ పవర్ మార్చి 12

గిద్దలూరు ఎమ్మార్వో కార్యాలయం దగ్గర ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ శానిటైజర్ (ఆయ) కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేసి అనంతరం గిద్దలూరు ఎమ్మార్వో కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు టీ ఆవులయ్య బి నరసింహులు మాట్లాడుతూ 10 సంవత్సరాల నుండి ప్రభుత్వ పాఠశాలలో శానిటేషన్ పాఠశాల పరిసరాలను పరిశుభ్రం ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న స్కూల్ శానిటైజర్లకు కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, కార్మికుల కొందరికి పీఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నెలకు 6000 రూపాయల తోటి కార్మికుల కుటుంబాలు బతకాలంటే ఇబ్బందిగా ఉంటుందని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని కోరారు. 2024 జనవరి నుండి మార్చి దాకా, పెండింగ్ లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో స్కూల్ శానిటైజర్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.కె షబీర, వై రాధా, మేరీ, జహీరా సీఐటీయూ నాయకులు డి థామస్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వపు విద్యార్థుల వితరణ


కలెక్టరేట్ ఒంగోలు పెన్ పవర్ మార్చి 12

స్థానిక సంతపేటలోని డి ఆర్ ఆర్ ఎం ఎం హైస్కూలు నందు పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు అదే పాఠశాలలో 1984-85 లో చదువుకున్న టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వపు విద్యార్థులు ప్రస్తుత పరీక్షా సామాగ్రిని, గ్రూప్ ఫోటో ఫ్రేములు అందించారు. ఈ కార్యక్రమం లో స్కూల్ హెడ్ మాస్టర్ వెంకరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరము 84-85 బ్యాచ్ చెందిన పూర్వపు విద్యార్థులు ఎస్ఎస్సీ విద్యార్థిని విద్యార్థులకు పరీక్షా సామగ్రిని ఇతర మెటీరియల్ ను అందజేస్తూ వారు చదువుకున్న పాఠశాలకు సేవలందిస్తున్నందుకు అభినందించారు. పూర్వ విద్యార్థులు శివప్రసాద్, ఊత కోలు శ్రీనివాసరావు, సాంబయ్య, శేఖరు, రత్న వర కుమార్, మాగులూరి సుధాకర్, వెంకటస్వామి, చావలి రమణయ్య సురేష్ రాజ్యలక్ష్మి శ్రీను ,రమేష్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

### జాతి జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు

### భారీ బహుమతులు



గిద్దలూరు పెన్ పవర్ మార్చి 13

గిద్దలూరు మండలం నరవ గ్రామంలో శ్రీ లక్ష్మీనారసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అఖిలభారత ఒంగోలు జాతి జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు

నరవ గ్రామం లో ఈనెల 15.నుండి. రేండు పళ్ళ విభాగం బహుమతులు.

1.బాహుమతి..25000
2.బాహుమతి..20000
3.బాహుమతి..15000
4.బాహుమతి..10000
5.బాహుమతి..07000
6.బాహుమతి..05000
7.బాహుమతి..03000
8.బాహుమతి..02000

16.03న.సీనియర్ విభాగం బహుమతులు.

1.బాహుమతి.111111
2.బాహుమతి..77777
3.బాహుమతి..55555
4.బాహుమతి..33333
5.బాహుమతి..22222
6.బాహుమతి..11111 కన్సిలేషన్.బాహుమతి..5000

కమిటీ..9959138036% 9866432566-9177269331 సెల్ నెంబర్లను సంప్రదించాలని కమిటీ కోరింది.

యాంకర్స్...వెంకటరామిరెడ్డి ఆక్కుపల్లి వ్యవహిస్తారన్నారు.



### ఆదరణ త్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని

# ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలి

**కులవృత్తులను ప్రోత్సహించాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయం.**

**ఆదరణ త్రీ పథకం ద్వారా లబ్ధిదారులకు 90% సబ్సిడీతో పనిముట్లు అందజేత.**

**త్వరలో మార్గదర్శకాలు వెల్లడి చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం -లబ్ధిదారులు కుల ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలి.**

**జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆదరణ పథకం పై నిర్వహించిన అవగాహన సదస్సులో వివరాలు వెల్లడించిన ఎంపీడీవో మస్తాన్ వలి.**





**కొమరోలు పెన్ పవర్ మార్చి 12**

బీసీ కులాలకు చెందిన కులవృత్తులు చేసుకునే లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదరణ త్రీ పథకం ద్వారా అవసరమైన పనిముట్లను అందజేయనున్నదని కొమరోలు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి పేర్కొన్నారు. కొమరోలు మండలంలోని బీసీ కులాలకు చెందిన సంఘ నాయకులు, లబ్ధిదారులకు ఆదరణ త్రీ పథకంపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు బుధవారం ఎంపీడీవో మస్తాన్ వలి ఆధ్వర్యంలో కొమరోలు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలకు చెందిన చేతి వృత్తుల వారిని ఆదుకొని వారి కుటుంబాలలో వెలుగు నింపాలనే ఆశయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఆదరణ త్రీ పథకాన్ని అమలు చేస్తున్నదని అన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ కాలాలలో రెండు విడతలుగా ఆదరణ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసి బీసీ కులాలకు చెందిన చేతివృత్తుల వారికి అవసరమైన పనిముట్లు అందజేసి వారి జీవితాల్లో వెలుగు నింపారని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా బీసీ కులాల కు చెందిన చేతివృత్తుల వారికి ప్రోత్సహించి వారిని అభివృద్ధి పరిచేందుకు ఆదరణ త్రీ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయనున్నదని ఆయన తెలిపారు. సదరు పథకం ద్వారా లబ్ధి పొందే లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో వారికి అవసరమైన పనిముట్లను అందజేయనున్నదని ఆయన తెలిపారు. చాకలి, కమ్మరి ,కుమ్మరి, వడ్రంగి యాదవ తదితర అన్ని కులవృత్తుల వారితో పాటు ముస్లిం మైనారిటీలు చేతివృత్తులు ఏర్పాటు చేసుకొనుటకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. చేతివృత్తులు సాగించుకొని లబ్ధిదారులకు అవసరమైన పనిముట్లను అందజేస్తారని వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు .ఆదరణ త్రీ పథకం కు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో ప్రభుత్వం వెల్లడించనున్నదని ,అందువల్ల లబ్ధిదారులు సదరు పథకం ద్వారా లబ్ధి పొందేందుకు దరఖాస్తులు చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు .అంతేకాక బీసీ కులాలకు చెందిన లబ్ధిదారులు సంబంధిత తాసిల్దార్ కార్యాలయం ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు పొంది సిద్ధంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సూచించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండల విస్తరణ అధికారి డి బ్రహ్మయ్య గ్రామ సచివాలయాల కార్యదర్శులు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యాదవ సంఘం నాయకులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, కొమరోలు తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బిజ్జాల తిరుమలరెడ్డి, కొమరోలు ముస్లిం మైనార్టీ నాయకులు వార్డు మెంబర్ షేక్ సుభాని తో పాటు పలు బీసీ సంఘాల నేతలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పెద్ద కందుకూరు, అయ్యవారిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం







**అర్ధవీడు, పెన్ పవర్, మార్చి12**

మండలంలోని పెద్ద కందుకూరు, అయ్యవారిపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి ఎస్కే మహమ్మద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నాగులవరం రైతు సేవ కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని కందులు క్వింటాలకు రు 7550 ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే శెనగ పంట కొనుగోలు కేంద్రం కూడా త్వరలో ప్రారంభిస్తామని క్వింటాలుకు రూ5650. చొప్పున కొనుగోలు చేస్తామని పంట నమోదు చేసుకున్న రైతులు రేపటి నుండి రైతు సేవ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలియ జేయడం జరిగినది. అనంతరం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పంటలను పరిశీలించి సూచనలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రాజ శేఖర్ రైతులు పాల్గొన్నారు.

# ప్రజల కష్టాల నుంచి ప్రజా క్షేమం కోసం పార్టి పుట్టింది

### మండల కన్వీనర్ ముసలారెడ్డి



**ఆర్ సి ఇన్ చార్జీ యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 12**

రాష్ట్రంలో అవస్థలో ఉన్న ఈ వ్యవస్థను మార్చేందుకు ,ప్రజలను కష్టాలనుంచి కాపాడి ప్రజా క్షేమం అందించేందుకు వైయస్సార్ సిపి ని మన నేత వైయస్ జగన్మోహన్ రెడ్డి స్థాపించారని మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి అన్నారు.వైయస్సార్ సిపి 15 వ ఆవిర్భావదినోత్సవ వేడుకలను బుదవారం జెండా ఆవిష్కరణ చేసి ఘనంగా నిర్వహించారు.ముందుగా దివంగతనేత వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పాదయాత్రతో ప్రజల కష్టాలను కళ్ళారా చూసి చలించిన జగనన్న, ప్రజలకు రాజన్న పాలన అందించేందుకు అభిలషించారని,2011 మార్చి 12 న వైయస్సార్ సిపి ని స్థాపించి ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాన్ని చేపట్టారని అన్నారు.యంపిపి దొంతకిరణ్ గౌడ్ మాట్లాడుతు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ,అంతకు మించి ఎన్నో సంక్షేమ పథకాలను అందించారని జగనన్న పాలనలో సంక్షేమ పథకం ఆందని గడప అంటు లేదని అన్నారు. ఎన్నో ఆశయాలతొ ప్రజలకు మంచి పాలన అందించిన జగనన్న పాలనను నేటికీ ప్రజలు కోరుకుంటున్నారని, తొమ్మిదేళ్ళలోనే కూటమి ప్రభుత్వం ప్రజల వ్యతిరేకతను మూటకట్టుకుందని అన్నారు. మళ్ళి జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టిని బలోపేతం చేసేందుకు అందరు కృషిచేయాలని కోరారు.అనంతరం ఒంగోలులో జరిగే యువత పోరు కార్యక్రమానికి భారిగా తరలివెళ్ళారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు ఉడుముల శ్రీనివాసరెడ్డి,రాష్ట్రరైతు నాయకులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లాపరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సాబిర్ బాష, జిల్లాయాక్టీవిటి కార్యదర్శి సింగాప్రసాద్ ,కొప్పర్తి ఓబుల్ రెడ్డి,పుల్లలచెరువు మండల నాయకులు ఉమమహేశ్వరరెడ్డి, ఆవులకోటిరెడ్డి, మైనార్టి నాయకులు షేక్ వలి, సయ్యద్ జబివుల్లా, రాములునాయక్ తదితరులు పాల్గోన్నారు.

## యువత పోరుకు తరలివెళ్లిన గుడ్లూరు వైసీపీ శ్రేణులు, యువకులు.



**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 12:**

విద్యార్థులు, యువత పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని చూపిస్తున్నదని ప్రశ్నిస్తూ వైయస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి గుడ్లూరు నుండి వైసీపీ యువ సభ్యులు, యువకులు బుధవారం తరలివెళ్లారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు "యువత పోరు" పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని వైసీపీ అధినాయకత్వం పిలుపు నిచ్చింది. వైసీపీ అధిష్టానం పిలుపు మేరకు, స్థానిక కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలు ఇవ్వగా వైసీపీ శ్రేణులు, యువకులు యువత పోరు కార్యక్రమానికి తరలివెళ్లి, జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.

## తెలుగుదేశం పార్టీ దర్శి ఇన్చార్జ్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశాలతో

### మండల అధ్యక్షులు నాగులపాటి శివ కోటేశ్వరరావు సారథ్యంలో మోడీ ఆంజనేయులు సహకారంతో







**దొనకొండ మార్చి 12 పెన్ పవర్**

మండల కేంద్రంలో జెడ్ పి హెచ్ హై స్కూల్ లో మరియు కేజీబీవి స్కూల్లో ఫ్యాట్ జామెంట్రీ బాక్స్ పెన్నులు పెన్సిల్లు స్కెల్లు మరియు హైస్కూల్లో జామెంట్రీ బాక్స్ పెన్నులు అందజేస్తూ పిల్లలకు పలు సూచనలు మీరు బాగా చదివి ఎగ్జామ్ బాగా రాసి మంచి ర్యాంక్ తెచ్చుకొని మీ తల్లిదండ్రుల పేర్లు నిలబెట్టి మీరు ఉన్న స్థాయికి ఎదగాలని పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దొనకొండ తెలుగుదేశం పార్టీ పలు నాయకులు. కొమ్మ తోటి సుబ్బయ్య. తోహిద్. రామారావు. చెంచయ్య. అనంతరాములు. సద్దాం. ప్రకాష్. నక్క నారాయణ. బత్తుల శ్రీను. బాలయ్య. తెలుగుదేశం నాయకులుల మోడీ ఆంజనేయులు టీమ్ దొనకొండ తదితరులు పాల్గొన్నారు.

## మాలకొండా రెడ్డి మరణం వైకాపా పార్టీకి తీరనిలోటు





**పీసీపల్లి పెన్ పవర్ మార్చి 12**

లక్ష్మక్క పల్లి పంచాయతీ (డీలర్) బద్దెల మాలకొండా రెడ్డి మరణం వైకాపా పార్టీకి తీరనిలోటని కనిగిరి వైసీపీ పార్టీ ఇంచార్జీ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మాలకొండా రెడ్డి మృతి చెందారని విషయం తెలుసుకున్న ఆయన బుధవారం లక్ష్మక్కపల్లి స్వగ్రామానికి చేరుకొని మాలకొండా రెడ్డి మృతి దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించినారు. మాలకొండా రెడ్డి మరణం వైకాపా పార్టీకి తీరనిలోటన్నారు. పెద్దాయన మరణం తన మనసు కలచివేసిందని చెబుతా ఇప్పటి వరకు ఆయన పార్టీ కి చేసిన సేవలను గుర్తుచేసుకోని కన్నీటి పర్యంతం అయ్యారు. పెద్దాయన లేని లోటు చాలా బాధాకరమని , ఇలాంటప్పుడే ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పెద్దాయన మాలకొండా రెడ్డి ఎక్కడ ఉన్నా ఆత్మ శాంతి కలగాలని భగవంతుడని కోరుకుంటున్నాను అన్నారు. ఆయన వెంట మండల వైకాపా కన్వీనర్ బుర్రారెడ్డి, మేకల మాలి, బద్దెల రత్నా రెడ్డి కుటుంబం సభ్యులు ఉన్నారు.

## సందాని కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీఎమ్మెల్యే కదిరి బాబురావు



**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 12**

కనిగిరి పట్టణానికి చెందిన షేక్ సందాని ఇటీవల గుండెపోటు తో అకాలమరణం చెందిన విషయం విదితమే.బుధవారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సందాని గృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.టీడీపీ లో తన వెన్నంటే ఉండి తన విజయానికి కృషి చేసారని ఈ సంధర్భంగా గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షేక్ జిలానీ, మాజీ కౌన్సిలర్స్ షేక్ ఫయాజ్, రహిమ్,బొట్టు శ్రీను,షరీఫ్, రహమాన్ ,బిసి సంఘం నాయకులుబత్తుల ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

**కొమరోలు మండలం అల్లినగరం, రాజుపాలెం లలో సోలార్ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం.**
**స్థలాల పరిశీలన చేసి నివేదికను జాయింట్ కలెక్టర్కు సమర్పించిన తాసిల్దార్.**





**కొమరోలు పెన్ పవర్ మార్చి 12**

కొమరోలు మండలానికి మంజూరైన రెండు సోలార్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను తాసిల్దార్ భాగ్యలక్ష్మి ,మండల సర్వేయర్ పఠాన్ సిలార్ ఖాన్ పరిశీలించారు. కొమరోలు మండలానికి మంజూరైన రెండు సోలార్ కేంద్రాలను అల్లినగరం, రాజుపాలెం లలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. ఆ మేరకు జిల్లా అధికారులు ఆదేశాల మేరకు తాసిల్దార్ భాగ్యలక్ష్మి మండల సర్వేయర్ సిలార్ ఖాన్ ,విఆర్ఓ లు, విలేజ్ సర్వేర్లతో కలిసి పరిశీలించారు .ఆ మేరకు అల్లినగరం రెవిన్యూ ఇలాకాలోని 523 సర్వే నెంబర్లో 6.50 ఎకరాలు, రాజుపాలెం రెవెన్యూ ఇలాకా లో 721/1 సర్వే నెంబర్లు 4.50 ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఎంపిక చేశారు .ఆ మేరకు పూర్తి సమాచారంతో కూడిన నివేదికను జిల్లా సబ్ కలెక్టర్కు సమర్పించామని తాసిల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. స్థలాల పరిశీలన కార్యక్రమంలో తాసిల్దార్ భాగ్యలక్ష్మి, మండల సర్వేయర్ సిలార్ ఖాన్, విఆర్వోలు పివి రమణ, వెంకటేశ్వర్లు ,విలేజ్ సర్వేయర్లు ప్రవీణ్ కుమార్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు ముసాయిదా జాబితాను చూసుకోవాలి

**ఈ పంట నమోదు మరియు సామాజిక తనిఖీ పై గ్రామసభ**
**మండల వ్యవసాయాధికారి బి. సంపత్ కుమార్**





**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 12**

చంద్రశేఖరపురం మండలంలోని దర్శిగుంటపేట,రేగులచెలక మరియు అంబవరం కొత్తపల్లి రైతు సేవ కేంద్రాలలో ఈ పంట నమోదు మరియు సామాజిక తనిఖీ మీద గ్రామసభ నిర్వహించడం జరిగింది ఈ గ్రామ సభలో మండల వ్యవసాయ అధికారి బి. సంపత్ కుమార్ మాట్లాడుతూ రబీ 2024 - 25 సీజన్ కు సంబంధించి రైతులు సాగు చేసినటువంటి ప్రతి పంటను వ్యవసాయ మరియు రెవిన్యూ శాఖ జాయింట్ అజమాయిష్ మీద ప్రతి పొలం దగ్గరకు వెళ్లి జిపిఎస్ కోఆర్డినేటర్స్ ఆధారంగా పంట నమోదు చేయడం జరిగిందని తెలిపారు పంట నమోదు చేసినటువంటి ముసాయిదా జాబితాను సామాజిక తనకి కొరకు రైతు సేవ కేంద్రం నందు జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు కావున రైతులందరూ ఒకసారి లిస్టు చూసుకొని ఏమైనా తేడాలు ఉన్నట్లయితే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేసినట్లయితే వారు విచారించుకొని సరి చేయడం జరుగుతుందని తెలిపారు అనంతరం ఈ పంట నమోదు ముసాయిదా జాబితాను గ్రామ సభలో చదివి వినిపించడం జరిగింది ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కావలి శ్రీనివాసులు గ్రామ వ్యవసాయ సహాయకులు పి. అనూష, వి. చిరంజీవి మరియు గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం గురించి చర్చ

**పాఠశాల అభివృద్ధికి సహకరించాలి -చర్చలో పాల్గొన్న పలువురు పూర్వ విద్యార్థులు**








**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 12**

చంద్రశేఖరపురం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980-81 నుండి 1990-91 సంవత్సరాలలో చదివిన పూర్వ విద్యార్థులు చైతన్య రెడ్డి చావా శ్రీనివాసులు టీచర్ పాలిశెట్టి సత్యం గ్రంధి హేమసుందరం సంగిశెట్టి పీరయ్య ఇండ్ల ప్రసాద్ పెరుగు శ్రీను కాశయ్య లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని ఆత్మీయ సమావేశం గురించి చర్చించారు ఈ సందర్భంగా చైతన్య రెడ్డి మరియు చావా శ్రీనివాసులు (టీచర్) మాట్లాడుతూ చాలా ఏళ్ల క్రితం మనము ఈ పాఠశాలలో చదువుకున్నాము అందరూ వివాహాలు చేసుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. పాత జ్ఞాపకాలను ఒకసారి గుర్తు చేసుకుని పూర్వ విద్యార్థినిలు ఒక్క చోటకు చేర్చి చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటామని తెలిపారు. మన పాఠశాల మనకు కేవలం చదువు నేర్పించడమే కాదు మనలో స్నేహము సహకారం మరియు సృజనాత్మకతను పెంపొందించి స్నేహ బంధాలు మన జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమమును ఎలా విజయవంతం చేయాలని దానిపై మనందరం దృష్టి సారించాలని ఈ పాఠశాలలో చదివిన ప్రతి ఒక్కరికి తెలియపరిచి సమావేశమునకు వచ్చేటట్లు చూడవలసిన బాధ్యత మనపై ఉందని దూర ప్రాంతాలలో ఉన్న పూర్వ విద్యార్థులకు సమాచారం అందించడానికి వారికి ఈ సమావేశం గురించి తెలియజేయడానికి కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సమావేశం గురించి పూర్వ విద్యార్థుల అభిప్రాయాలను సలహాలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలతో పాఠశాలను తమ వంతు అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. పూర్వ విద్యార్థుల సమావేశం ద్వారా మనందరి మధ్య ఉన్న అనుబంధం బలంగా మారుతుంది కాబట్టి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మనమందరం కలిసి పనిచేయాలని తెలిపారు.

# రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

**దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్**



**పొదిలి, పెన్ పవర్ మార్చి 12**

రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించుకోవాలని దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్ కోరారు బుధవారం నాడు మండలంలోని కంబాలపాడు, నంది పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి విచ్చేసిన వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్ రైతులతో సమావేశం జరిపి మాట్లాడారు రైతులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగపరుచు కొనడం ద్వారా ఆర్థికంగా ఎదగాలని బాలాజీ నాయక్ సూచించారు రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ పనిముట్లు 50 శాతం రాయితీపై అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు పనిముట్లు అవసరమైన రైతులు అందుకు సంబంధించిన పత్రాలను గ్రామ వ్యవసాయ సహాయకుల నుండి తీసుకొని దరఖాస్తు చేసుకోవాలని కోరారు మండల వ్యవసాయాధికారి షేక్ జైను లాబ్దిన్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందేందుకు రైతులు తప్పనిసరిగా విశిష్ట సంఖ్య తీసుకోవాల్సి ఉందన్నారు మండలంలో ఇప్పటివరకు 66 75 మంది రైతులు గుర్తింపు సంఖ్య పొందడం జరిగిందని చెప్పారు ఇందులో పిఎం కిసాన్ లబ్ధిదారులు 41 68 మంది, ఉన్నారని, ఇంకా 2507 మంది పీఎం కిసాన్ రైతులు గుర్తింపు సంఖ్యను తీసుకోవాల్సి ఉందన్నారు ఉద్యానవన విస్తరణ అధికారి బి ధనలక్ష్మి మాట్లాడుతూ ఉదాహరణ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు అలాగే నిమ్మ, మిరప పంటల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# హై పవర్ వైర్ పట్టుకుని యువకుని ఆత్మహత్యా యత్నం

**రైల్వే స్టేషన్ లో ఆగిఉన్న గూడ్స్ బండిఎక్కి హై పవర్ వైర్ ను పట్టుకున్న యువకుడు**
**కాచిగూడ నుంచి వచ్చిన రైలులో గిద్దలూరులో ఆత్మహత్య యత్నం**

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 12**



గిద్దలూరులో ఓ యువకుడు రైల్వే హై టెన్షన్ 25 కే.వీ వైర్లను పట్టుకొని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటన గిద్దలూరు రైల్వే స్టేషన్ లో బుధవారం నాడు చోటుచేసుకుంది. ఆగిన గూడ్స్ రైలును ఆ యువకుడు ఎక్కి హైపవర్ వైర్ ను పట్టుకున్నాడు. ఆ యువకుడికి విద్యుత్ షాక్ కొట్టి తీవ్ర గాయాలు కావడంతో గూడ్స్ రైలు పై నుంచి క్రింద పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన రైల్వే పోలీసులు వెంటనే అంబులెన్స్ లో గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రధమ చికిత్స అనంతరం క్షతగాత్రుడు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. హై పవర్ విద్యుత్ వైర్లు పట్టుకొని ఆత్మహత్యకు యత్నించిన యువకుడు కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన వరికుంట్ల అమర్నాథ్ గా రైల్వే పోలీసులు గుర్తించారు. కాచిగూడ రైలులో కాచిగూడ నుంచి ప్రయాణిస్తూ గిద్దలూరు లో అమర్నాథ్ తో పాటు అమర్నాథ్ స్నేహితుడు శివశంకర్ గిద్దలూరులో దిగారు. అమర్నాథ్ గూడ్స్ రైలు ఎక్కి హై పవర్ కరెంటు వైర్ పట్టుకుంటున్న సమయంలో శివశంకర్ అతనిని ఆపేందుకు ప్రయత్నించి విఫలుడయ్యాడు అమర్నాథ్ బలవంతంగా గూడ్స్ రైలు ఎక్కి విద్యుత్ వైర్ పట్టుకొని తీవ్ర గాయాలు పాలయ్యాడు. అమర్నాథ్ చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల ఓ ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీ 45 లక్షల ప్యాకేజీ ని అమర్నాథ్ కు ఆఫర్ చేసినట్టుగా తెలుస్తుంది. చేతికొచ్చిన బిడ్డ ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

# వాహనాలు మంచి కండిషన్లో ఉంచుకోవాలి

**- జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్**



**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 12**

ప్రజాసేవలకు వినియోగించే పోలీస్ వాహనాలు మంచి కండిషన్లో ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ పేర్కొన్నారు. పోలీస్ మోటార్ ట్రాన్స్పోర్ట్ విభాగం నందు పలు రకాల పోలీస్ వాహనాలను వాటి పనితీరు నిర్వహణ గురించి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడుకోవడంలో పోలీసు వాహనాలు ఎంత ముఖ్యమైనవి అని రాత్రివేళ పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం తిరగాలన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లకు సంబంధించిన వాహనాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా కండిషన్ లో ఉంచుకోవాలన్నారు. పోలీస్ స్టిక్కర్లు అత్యవసర హారన్ మొదలైనవి సక్రమంగా అమర్చుకోవాలి అన్నారు. వాహనం ఏదైనా రిపేరుకొస్తే వెంటనే చేయించుకుని వాహనాలను వినియోగించుకోవాలన్నారు. డ్యూటీలోనే డ్రైవర్లు నీట్ టర్న్ అవుట్ యూనిఫామ్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. పోలీస్ అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సొంత వాహనంలా చూసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో మాత్రమే సైరన్ ఉపయోగించాలని వాహనాన్ని అతివేగంగా నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డిఎస్పి శ్రీనివాసరావు, ఆర్ఐ రమణారెడ్డి, ఏఎంవిఐ ధర్మేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయాలి

**జనసేన నాయకులు గూడంశెట్టి రవికుమార్**

**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 12**



ఈ నెల 14వ తేదీన పిఠాపురంలో జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని చంద్రశేఖరపురం మండల జనసేన పార్టీ నాయకులు గూడంశెట్టి రవికుమార్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంనకు జన సైనికులు భారీ ఎత్తున తరలి వెళ్లాలని అన్నారు జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని అన్నారు జన సైనికులు పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కష్టపడిన ప్రతి ఒక్కరిని గుర్తిస్తామని జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కార్యకర్తలకు తెలియజేశారని అన్నారు అప్పుల ఊబిలోకి కోరుకున్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ప్రజలు పెట్టుకున్న నమ్మకం నిజం చేయడానికి పనిచేస్తున్నారని అన్నారు పార్టీ కోసం కష్టపడి ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు రేపు జరగబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవంనకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# దర్శిగుంటపేట అంబవరం కొత్తపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

## మండల వ్యవసాయాధికారి బి. సంపత్ కుమార్






**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 12**

ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉందని ఈ దశలో ఎకరాకు 15-20 కేజీలు పోటాష్ ఎరువు ను పై పాటుగా వేసుకోవలెను అని మండల వ్యవసాయ అధికారి బి సంపత్ కుమార్ తెలిపారు చంద్రశేఖరపురం మండలంలోని దర్శిగుంటపేట మరియు అంబవరం కొత్తపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామంలో సాగు చేసినటువంటి వరి పంటను పరిశీలించారు ప్రస్తుతం వరి పంటలో కాండం తొలిచేటటువంటి పురుగును గమనించడం జరిగింది నివారణకు తీసుకోవాల్సిన అటువంటి సమగ్ర సస్యరక్షణ చర్యలను గురించి రైతులకు వివరించడం జరిగింది అనంతరం రైతుల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పొలం ఉన్నటువంటి ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవ కేంద్రం నందు ఫార్మర్ రిజిస్టర్ రిపోర్టర్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు రైతులకు పెట్టుబడి సాయం కింద వచ్చే విడత పీఎం కిసాన్ డబ్బులు పడాలంటే తప్పనిసరిగా ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండవలేనని తెలిపారు, వ్యవసాయ రంగంలో అన్నదాతల సంక్షేమం, సాగు పెట్టుబడి సాయం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ పథకాలు అర్హులకు మాత్రమే అందేలా వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికరించినందుకు రైతులకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కేంద్రం జారీ చేస్తుంది ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ నందు పొలం ఉన్నటువంటి ప్రతి రైతు రైతు సేవ కేంద్రం నందు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

కావున రైతులు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఆధార్ నెంబర్కు లింకు అయిన ఫోను నెంబర్ ఉన్న ఫోను తీసుకొని రైతు సేవ కేంద్రానికి వెళ్లాలని తెలిపారు. రైతు సేవ కేంద్ర సిబ్బంది రైతుల సమక్షంలోనే ఈ విశిష్ట సంఖ్య కోసం కంప్యూటర్లో నమోదు చేస్తారని తెలిపారు, నిర్దేశిత పోర్టల్ లో రైతు భూమి వివరాలు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ వివరాలు నమోదు చేస్తారు ఈ నమోదు పూర్తిగానే రైతుల మొబైల్ కు ఓటిపి వస్తుంది ఈ ఓటిపిని రైతు సేవ కేంద్ర సిబ్బందికి తెలియజేస్తే నమోదు ప్రక్రియ పూర్తి అయి రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పావలి. శ్రీనివాసులు గ్రామ వ్యవసాయ సహాయకురాలు పి అనూష మరియు గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

# వీఐపీల భద్రత పై అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్



**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 12**

ముఖ్యమైన ప్రముఖుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆర్ దామోదర్ సూచించారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పర్సనల్ సెక్యూరిటీ అధికారులకు బుధవారం ఎస్పీ కార్యాలయం నందు ఎస్పీ పలు సూచనలు చేశారు. జిల్లాలో ప్రముఖ వ్యక్తుల వద్ద వ్యక్తిగత భద్రత నిర్వహించే పర్సన్ సెక్యూరిటీ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వారిని వారు రక్షించుకుంటూ తాము రక్షణ కల్పించవలసిన ప్రముఖులకు ఎలాంటి ప్రమాదము లేకుండా భద్రత అందించాలన్నారు. స్థానిక పోలీస్ శాఖతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ఎప్పటికప్పుడు స్థానిక సమాచారాన్ని సేకరించుకోవాలన్నారు. ఇటీవల కాలంలో ప్రముఖుల భద్రతలో చోటు చేసుకున్న భద్రతా లోపాలను గురించి తెలుసుకుంటూ అటువంటి వాటికి అవకాశం లేకుండా పూర్తిస్థాయిలో విధులు ఏ విధంగా నిర్వహించాలో వివరించారు. శిక్షణ ద్వారా ఆయుధాలను ఉపయోగించడంలో నైపుణ్యం ఆత్మరక్షణ మెరుగుపడుతుందని, నీటుగా యూనిఫాం కలిగి ఉండాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

## జి ఆర్ పి సి ఐ ఎస్ కే మౌలా షరీఫ్

**క్రైం రిపోర్టర్ ఒంగోలు,పెన్ పవర్ మార్చి 12**

రైలులో ఒంటరి మహిళలను టార్గెట్ గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు జి ఆర్ పి సి ఐ ఎస్. కే.మౌలా షరీఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ, హర్యానా రాష్ట్రాలకు చెందిన ముగ్గురు సభ్యుల ముఠా రైల్లో ప్రయాణం చేస్తూ ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలను టార్గెట్ చేసుకొని వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోపిడీకి పాల్పడుతున్నట్లు తెలిపారు. చెన్నై నుండి పినాకిని ఎక్స్ప్రెస్ లో టి అనురాధాన అనే మహిళ చెన్నై నుండి విజయవాడకు వస్తుంది. ఈ దొంగల ముఠా ఆమెను టార్గెట్గా చేసుకొని అందులో ఏ వన్ ముద్దాయి అయినా కాజల్ వర్మ బాధితురాలు పక్కనే కూర్చుని ఉంది. ముందుగా పథకం ప్రకారం ఆమెకు కర్చీఫ్ లో మత్తుమందు చల్లి దానిని ఆమె ముక్కు వద్ద ఉంచి అపస్మారస్థితిలో పోయే విధంగా చేయడం జరిగింది. అనంతరం ఆమె మెడలోని బంగారు వస్తువులు దోచుకుని దిగిపోవడం జరిగింది. ఆ మత్తు నుండి కోలుకున్న మహిళ చీరాల రైల్వే స్టేషన్ లో దిగి జి ఆర్ పి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కేసు పై ప్రత్యేక దృష్టి సారించి కేసు ఇన్వెస్టిగేషన్ చేయడం జరిగింది. దొంగల ముఠాను పట్టుకునేందుకు ముందుగా చెన్నై రైల్వే స్టేషన్ లోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల ను పసిగట్టి వారి కోసం వేట ప్రారంభించారు. ఇందులో ఏ 1 ముద్దాయి అయిన కాజల్ వర్మ ను రాయపూర్ ఎయిర్ పోర్టులో జనవరి రెండో తేదీన అరెస్టు చేయడం జరిగింది. ఏ2 ముద్దాయి విజయేందర్ ను హర్యానాలో అరెస్టు చేసి ట్రాన్సిట్ వారింటిపై బుధవారం చీరాల పోలీస్ స్టేషన్ తీసుకురావడం జరిగిందని తెలిపారు. రైలు ప్రయాణికుల భద్రత కోసం నిరంతరం పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండి ప్రయాణికులకు భరోసా కల్పిస్తుందని సిఐ తెలిపారు. ఈ కేసులో చీరాల ఎస్సై కొండయ్య, కానిస్టేబుల్స్ ఖాదర్ బాషా,లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి, కొళాయి పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించండి

## కొమరోలు మండల విస్తరణ అధికారి, కొమరోలు పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి బ్రహ్మయ్య.



**కొమరోలు పెన్ పవర్ మార్చి 12.**

తమ ఇళ్లకు, నీటి కొళాయిలకు సంబంధించిన పన్నులను సకాలంలో చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కొమరోలు మండల పంచాయతీ విస్తరణాధికారి, కొమరోలు పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి .బ్రహ్మయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొమరోలు గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం బ్రహ్మయ్య పెన్ పవర్ ప్రతినిధితో మాట్లాడుతూ, గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రజలు చెల్లించే పలు రకాల పన్నులు ,వ్యాపార సంస్థల లైసెన్సులు తదితర వాటిపై ఆధారపడి ఉన్నదని ఆయన చెప్పారు. ప్రజలకు సకాలంలో నీటి సౌకర్యం ,విద్యుత్ సౌకర్యం, తోపాటు పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించవలసి ఉంటుందని, అంతేకాక వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కూడా నిధులు అవసరమని ఆయన తెలిపారు. అందువల్ల కొమరోలు మండలంలోని అన్ని గ్రామపంచాయతీల ప్రజలు సకాలంలో ఇంటి పన్ను ,నీటి కొళాయి పన్నులను పంచాయతీ కార్యదర్శులకు చెల్లించి తప్పనిసరిగా రసీదులు పొందాలని ఆయన కోరారు. కాగా కొమరోలు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు తమ ఇళ్లకు సంబంధించిన పన్నులను, నీటి కొళాయి పన్నులను వెంటనే చెల్లించాలని, పన్నులను కొమరోలు గ్రామపంచాయతీ కార్యాలయంలో డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లించి రసీదులు పొందాలని పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి బ్రహ్మయ్య కోరారు. ఆ కార్యక్రమంలో కొమరోలు గ్రామ సచివాలయం 2,3 కార్యదర్శులు జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# గిద్దలూరు రైల్వే స్టేషన్ సూపరిండెంట్ నాయబ్ రసూల్ ఉద్యోగ బదిలీ సందర్భంగా ఘన సన్మానం



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 12**

గిద్దలూరు రైల్వే స్టేషన్ లో షేక్ నాయబ్ రసూల్ స్టేషన్ సూపరిండెంట్ గా విధులు నిర్వహిస్తూ జగ్గం బొట్ల కృష్ణాపురం రైల్వే స్టేషన్ కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా తోటి స్టేషన్ సూపరిండెంట్లు, తోటి రైల్వే ఉద్యోగులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టేషన్ సూపరెండెంట్ షేక్ నాయబ్ రసూల్ గిద్దలూరు రైల్వే స్టేషన్ లో విధుల్లో చేరినప నాటి నుండి ఇప్పటి వరకు ఎనలేని సేవలను అందించారని, డ్యూటీ ని సక్రమంగా నిర్వర్తించే వారిని, పేద వారికి సహాయం చేసే గుణం కలిగిన దాత అని, మంచి మనసున్న వ్యక్తి అని, సౌమ్యుడు అని, గిద్దలూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం ఆయన తన వంతు కృషి చేసిన వ్యక్తి అని, తోటి సిబ్బందితో కలిసి మెలిసి పని చేసేవాడని, నాయబ్ రసూల్ లాంటి మంచి వ్యక్తి బదిలీ కావడం చాలా భాధాకరం గా వున్నా ఆయన జగ్గం బొట్ల కృష్ణాపురం లో కూడా మంచి పేరు తెచ్చుకోవాలని దేవున్ని కోరుకుంటున్నామని వారు అన్నారు. గిద్దలూరు స్టేషన్ సూపరెండెంట్ షేక్ నాయబ్ రసూల్ కు తోటి రైల్వే ఉద్యోగస్తులు అందరూ శుభాకాంక్షలు తెలియచేశారు. సన్మానం అనంతరం నాయబ్ రసూల్ అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సిబ్బంది , బంధుమిత్రులు, ఆర్పిఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా నిషేధిత భూముల పున:పరిశీలన- జిల్లా కలెక్టర్



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 12**

నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల పున పరిశీలన ప్రక్రియ ఎలాంటి తప్పులు లేకుండా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేలా క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ తో కలసి జిల్లాలో జరుగుచున్న నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల పున పరిశీలన ప్రక్రియ పురోగతిపై మండలాల వారీగా రెవెన్యూ అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిషేధిత భూముల జాబితాలో నుంచి తొలగించిన భూములు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయ్యాయా లేదా పూర్తిస్థాయిలో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పున పరిశీలన జరగాలన్నారు. ఈ ప్రక్రియపై సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు, ప్రత్యేక అధికారులు ప్రత్యేక శ్రద్ధ సారించాలన్నారు. ఈ సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, కనిగిరి ఆర్డిఒ కేశవర్ధన్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, సత్యనారాయణ, తహసిల్దార్లు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవతరగతి విద్యార్థులకు పరీక్షసామగ్రి అందజేత.





**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 12:**

సనాతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాలువ సాయికృష్ణ, రామకృష్ణ, పవన్ కుమార్ ల సహకారంతో గుడ్లూరు మండల పరిధిలోని గ్రామీణ ప్రాంత పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బసిరెడ్డిపాలెం, కేజీబీవీ, చేవూరు, గుడ్లూరు హైస్కూళ్ల తో పాటు పాత పట్టపుపాలెం హైస్కూల్ లలో సనాతన ఫౌండేషన్ అధ్యక్షులు బొద్దుకూరి నారాయణరావు పరీక్ష సామగ్రిని ఆయా పాఠశాలలో గల విద్యార్థులకు తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి, ఉన్నత స్థానానికి రావాలని, గ్రామానికి చదువుకున్న పాఠశాలకి మంచి పేరు తేవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల సనాతన ఫౌండేషన్ అధ్యక్షులు ఇన్నమూరి ప్రమీల సుధాకర్, బలిచాట్ల శ్రీకర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సవాలక్ష సమస్యలు; పరిష్కార శూన్యం

## - ప్రజా చైతన్య యాత్రలో పలువురు;ఏకరువు



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మార్చి 12**

తాగునీటి కోసం నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని, సైడ్ కాలువల్లో మురుగు చేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, రోడ్లు, విద్యుత్ వంటి సౌకర్యం లేక అగచాట్లు పడుతున్నామని పలువురు కాలనీలవాసులు వెల్లడించారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం నాడు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు నగర పరిధిలోని గాంధీనగర్, శివప్రసాద్ కాలనీ, కొత్త డొంక, జడ్పీ కాలనీ, సుబ్బయ్య కాలనీ, సుందరయ్య నగర్,విఐపి రోడ్,సుజాతనగర్ మంగమూరు రోడ్డు; తదితర ప్రాంతాల్లో; బృందం; పర్యటించింది. ఈ సందర్భంగా పలు కాలనీలలో తాగునీటి కోసం రాత్రి 12 వరకు పడిగాపులు కాస్తున్నామని, కొన్ని సందర్భాల్లో మురుగునీరు వస్తుందని, నీరు వచ్చిన రోజు నిద్రలేక మరునాడు పనులు మానుకోవాల్సి వస్తుందని; స్థానికులు వాపోయారు. గాంధీ నగర్ లో 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, వాటి వల్ల ప్రమాదం పొంచి ఉందని, వాటి స్థానంలో కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని; స్థానికులు సూచించారు. 33 వ డివిజన్ కొత్త డొంకలో కల్వర్టు నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.కాలనీలలో కాలువలు శుభ్రం చేయని కారణంగా మురుగు పేరుకుపోయి, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, కుక్కల బెడద తీవ్రంగా ఉందన్నారు. హరిహర నగర్ లో పార్కు ఆక్రమణకు గురవుతుందని, ఆక్రమణదారుల నుండి పార్కును వినియోగంలో తేవాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. మంగమూరు రోడ్డు ,విఐపి రోడ్; సుజాతనగర్ లో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందన్నారు. డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు. మంగమూరు రోడ్డు కూడళ్లు, మలుపుల వద్ద; ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని తొలగించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో నగర; కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు జీ రమేష్ ,తంబి శ్రీనివాసులు, నగర నాయకులు సయ్యద్.; హుస్సేన్, టి మహేష్,బివి రావు , సిహెచ్ వినోద్ ,కే ఎఫ్ బాబు, ఎస్కే పీరు ,సురేష్, దామా శ్రీనివాసులు, సిద్దయ్య, కొండూరి విశ్వసేన్, కస్తూరి, గోవిందమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గా గడ్డం కవిత ఏకగ్రీవంగా ఎన్నిక





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మార్చి 12**

టంగుటూరు మండలానికి చెందిన గడ్డం కవిత ప్రకాశం జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఒంగోలు లోని టిటిడిసి కార్యాలయంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఎన్నిక జరిగింది. 38 మండలాల్లోని మండల సమాఖ్య అధ్యక్షులు, ఆఫీస్ బేరర్స్ ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చిరుతోటి నరసింహారావు, ఎన్నికల అధికారి గా రాచర్ల ఎపియం రమేష్ బాబు, లీగల్ కో-ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య ఎన్నికల ప్రక్రియ జరిపించారు. అంతకు ముందు జిల్లా సమాఖ్య మహాసభ జరిగినది. ఈ సభకు మాజీ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గోవిందమ్మ అధ్యక్షత వహించారు. అనంతరం నూతన కమిటీని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## మంత్రిని కలిసిన శివరాం



**కందుకూరు పెన్ పవర్ మార్చి 12**

కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి కమిటీ తరపున అమరావతిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య ప్రసాద్ ని వారి ఆఫీస్ నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమం లో కందుకూరు నియోజకవర్గంలోని పలు అంశములపై చర్చించి కందుకూరి ఏరియా వైద్యశాలకు సహాయ సహకారాలు అందించాలని శివరాం కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు శివరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డాక్టర్ ది వి శివరాం, పొడపోటి శ్రీనివాసరావు, తోకల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## దొంగలు బాబోయ్ దొంగలు...

### పొలాలలో మోటార్ల కేబుల్స్ చోరీ.







**పొన్నలూరు,పెన్ పవర్ మార్చి 12**

స్థానిక గొరిసెలేరు సమీప ప్రాంతాలలో సుమారు పది వ్యవసాయ మోటార్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలు కత్తిరించుకొని పోతున్నారని పలువురు రైతులు వాపోతున్నారు.గత కొన్ని రోజులుగా ఈ దొంగతనాలు జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులు ఈ విషయాన్ని గమనించారు. సబ్ మెర్సిబుల్ మోటర్ నుంచి మెయిన్ బోర్డ్ వరకు ఉండే కేబుల్ కట్ చేసి ఉండటాన్ని గమనించిన రైతులు ఆందోళన చెందుతున్నారు మొత్తం 15 మోటర్లు వరకు లెక్క తేలేయని బాధిత రైతులు తెలిపారు, కొన్ని సోలార్ మోటార్ల వద్ద వైర్లు కట్ చేశారని వీటి విలువ దాదాపు ఒక్కొక్క రైతుకు పదివేల రూపాయలు వరకు నష్టం ఉంటుందని వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .పలువురు రైతులు మాట్లాడుతూ అసలే వేసవికాలం సరైన సమయంలో పంటలకు నీరు పెట్టాల్సిన అవసరముందని ఈ సమయంలో ఇలా జరగడం వల్ల నీరు పెట్టలేక దిగుబడి తగ్గి రైతులకు నష్టం వస్తుందన్నారు. అసలే మిర్చి పంటకు తగిన ధర లేదని బాధపడుతుంటే దానికి తోడు ఇలాంటి దొంగతనాలు జరుగుతుంటే మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టే అని వారు బాధపడుతున్నారు, దీనిపై పోలీసు యంత్రాంగం తగిన చర్యలు తీసుకొని న్యాయం జరిగేటట్టు చూడాలని వారు కోరుతున్నారు.

## శ్రీ బాలస్వామి చేతుల మీదుగా

# వాసవి సేవాసమితి శంకుస్థాపన

**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం మార్చి 12**

ఒంగోలు సంతపేటలో వాసవీ సత్ర సముదాయాల ఆధ్వర్యంలో వాసవి సేవా సమితి బాలా లీలా వృద్ధాశ్రమం,అతిధిగృహం పెనుగొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ పీఠాధిపతి పరమపూజ్య శ్రీశ్రీశ్రీ బాలస్వామి చేతుల మీదుగా బుధవారం శంకుస్థాపన చేశారు. వాసవి సత్ర సముదాయాల గౌరవ అధ్యక్షులు శిద్దా నాగేశ్వరరావు దంపతులు, వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు దంపతులు, ప్రధాన కార్యదర్శి ఇల్లూరు లక్ష్మయ్య శంకుస్థాపన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ బాలా లీలా అనే పదం లలితా సహస్రనామంలో ఉందని, అటువంటి బాలా లీలా దంపతులు ఇలాంటి మంచి కార్యక్రమానికి స్థలాన్నివ్వడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. వాసవి సత్రాల ద్వారా దేవకి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్నో మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయని దానిలో ఇది ఒక మంచి కార్యక్రమమని అన్నారు. దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గౌరవ చైర్మన్ టి జి వెంకటేష్ ఆధ్వర్యంలో వాసవి సత్రాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఒంగోలు పట్టణంలో వాసవి సత్ర సముదాయాల ఆధ్వర్యంలో వాసవి సేవా సమితి బాలా లీలా వృద్ధాశ్రమానికి నేడు శంకుస్థాపన చేయడం, ఈ కార్యక్రమం లో పరమ పూజ శ్రీ బాలస్వామి పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. రెండు కోట్ల విలువైన స్థలాన్ని ఇలాంటి మంచి కార్యక్రమానికి మంచి మనసుతో ఉచితంగా అందజేసిన సీఏ గ్రంధి బాలా, సీఏ గ్రంధి సుధీర్ లకు వాసవి మాత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు.



వాసవి సత్ర సముదాయాల తరఫున వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు అన్నా రాంబాబు, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్ కుమార్,శిద్దా పాండు రంగారావు, హనుమంతరావు, సూర్య ప్రకాష్, సురేష్, బిఎంఆర్ శంకర్, రవికుమార్, వాసవి సత్ర సముదాయాల ఆర్బిటేటర్ సిఏ పెనుగొండ సుబ్బరాయుడు, కోశాధికారి పెరుమాళ్ళ కోటేశ్వరరావు, ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య నాయకులు ఇమ్మడిశెట్టి కోటేశ్వరరావు, ఇమ్మడిశెట్టి సత్యనారాయణ, డాక్టర్ ప్రకాష్ చవల, కనుమర్లపూడి హరిప్రసాదరావు, బిఎమ్ఆర్,మీడియా చైర్మన్ చక్కా



వెంకట కేశవరావు తదితర ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## విస్తరణ దిశగా కందుకూరు

# అభివృద్ధి మండలి



**కందుకూరు పెన్ పవర్ మార్చి 12:**

కందుకూరు నియోజక వర్గ అభివృద్ధి మండలి ని నియోజక వర్గ స్థాయిలో విస్తరించాలని కమిటీ నిర్ణయించింది. అందులో భాగంగా బుధవారం కందుకూరు కోర్టు కాంప్లెక్స్ లోని బార్ అసోసియేషన్ నందు అడ్వకేట్స్ ను కలసి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశనికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. వి. సుబ్బారావు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి పి. సంపత్ కుమార్ , సీనియర్ అడ్వకేట్స్ బెజవాడ కిష్టయ్య, చౌదరి, సిహెచ్ హరికృష్ణ, శ్రీధర్ నాయుడు, బీవీ మురళీకృష్ణ, ప్రసాద్ రెడ్డి ఇతర అడ్వకేట్స్ చాలా మంది హాజరు అయ్యారు. అభివృద్ధి మండలి అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం మాట్లాడుతూ నియోజక వర్గం లోని అనేకమంది మేధావులు ఉద్యోగులు వ్యాపారులు, వివిధ పార్టీల ప్రతినిధులు, రైతులు, రైతు కూలీలు, సామాన్య పనివారు, ఇంజనీర్లు, లాయర్లు, డాక్టర్లు ఇలా అనేకమంది అభివృద్ధి కాముకుల ప్రతినిధులతో రాజకీయాలకు అతీతంగా ఈ అభివృద్ధి మండలి ఏర్పడింది అని కందుకూరు నియోజక అభివృద్దే లక్ష్యం అని, ఏ ఒక్క వ్యక్తికి గాని సమూహనికి గాని, వర్గానికి, కులానికి, మతానికి, రాజకీయ పార్టీలకు గాని ఈ అభివృద్ధి మండలి వ్యతిరేకంగా ఉండదని, ఉండలేదని ఆయన వివరించారు. కందుకూరు కు ప్రాణమైన రాళ్లపాడు ప్రాజెక్ట్ రిపేర్, నిర్వహణ విషయంలో అటు కలెక్టర్ తో, ఇటు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తో, ప్రాజెక్ట్ దగ్గరి పనివారితో నిరంతరం టచ్ లో ఉంటూ అక్కడ రైతుల మేలుకోసం కృషి చేశామని తెలిపారు. ప్రాజెక్ట్ వద్ద తగిన సిబ్బందిని ఇవ్వాలని సంబంధిత మంత్రిని అడిగామని చెప్పారు. అలాగే స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో పెట్రోల్ బంక్ నిర్మాణం చేయవద్దు అని రెవిన్యూ మంత్రి ను కలెక్టర్ ను సంభంధిత అధికారులను సంప్రదించి నిర్మాణన్ని తాత్కాలికంగా నిలిపామని, ఇంకా రామాయపట్నం పోర్ట్, రైతులకు నష్టపరిహారం, కొండముడుసుపాలెమ్ దగ్గర అండర్ పాస్ అసైన్మెంట్ భూముల విషయం పెండింగ్ ఉన్నవి. అలాగే ఏరియా హాస్పిటల్స్, మండల పీహెచ్ లలో సౌకర్యాల గురించి మంత్రి తో మాట్లాడి రావడం జరిగింది అని చెప్పారు. తాను, తన అభివృద్ధి మండలి సభ్యులు ఇప్పటివరకు సొంత డబ్బులతోనే ఈ కార్యక్రమాలకు హాజరు అయ్యామని చెప్పారు. మా కార్యక్రమాలకు ముచ్చటపడి ఈ రోజు మన మధ్య పట్టణ ప్రముఖ వ్యాపారి, రాజకీయ వేత్త కొల్లూరు కొండయ్య (గ్యాస్ ) ఉన్నారని పరిచయం చేశారు.కావున మేధావి వర్గానికి చెంది అడ్వకేట్స్ కలసి రావాలని కోరగా వారు అందుకు అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి మండలి ఉపాధ్యక్షులు పాలేటి. కోటేశ్వరరావు (బ్యాంకు రిటైర్డ్ అధికారి ), కన్వీనర్లు తోకల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ చింతరబోయిన నరేష్ హాజరు అయ్యారు.

## ఘనంగా వైకాపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### జెండా ఆవిష్కరించిన బుర్రా



**కందుకూరు పెన్ పవర్ మార్చి 12**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15వ పార్టీ ఆవిర్భావ దినోత్సవవేడుకను మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బుధవారం కందుకూరు పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధుసూదన్ యాదవ్ వైసీపీ జెండాను ఆవిష్కరించారు. మొదటిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేదవాడి కోసం పుట్టిన పార్టీ అన్నారు, ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా. ప్రియతమ నేత వైయస్ జగన్మోహన్ రెడ్డి మొక్కవోని దీక్షతో పట్టుదలతో పేదల అభివృద్ధి కోసం ఎంతో కష్టపడుతున్నారు అన్నారు, 2029లో జరగబోవు ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రిగా చేసుకునే బాధ్యత మనందరి పైన ఉందని అన్నారు. దీనికి మనందరం కంకణబద్ధులై పనిచేయాలని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉలవపాడులో ఘనంగా వైఎస్ఆర్‌సీపీ

# 15వ ఆవిర్భావదినోత్సవం

### కార్యక్రమ విజయవంతంపై ధన్యవాదాలు తెలిపిన అధ్యక్షులు నన్నం పోతురాజు





**ఉలవపాడు, పెన్ పవర్, మార్చి 12:**

వైయస్ఆర్ సీపీ 15వ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా మండలపార్టీ ఆద్వర్యంలో ఉలవపాడులో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మువ్వెనెల జెండాను ఆవిష్కరించి తదనంతరం కేక్ ను కట్ చేసి వైసీపీ శ్రేణులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు అందజేశారు. మండల వైసీపీ అధ్యక్షులు నన్నం పోతురాజు మాట్లాడుతూ వైసీపీ 15వ ఆవిర్భావదినోత్సవ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు నన్నం పోతురాజు, మాజీ జడ్పిటిసి సభ్యులు కోటు కోటిలింగం, ఎంపీపీ ప్రతినిది తిరుపతి (మోహన్ బాబు), యంపిటిసి రమణయ్య , కొ-అప్సన్ ఖాదర్ భాషా, మాజీ యంపిటిసి సుందరమ్మ, ఆర్టీసీ సుబ్బారావు, వెలిచెర్ల చంద్రశేఖర్, కోటు కోటయ్య, కట్టా శ్రీనివాసులు, రత్నం, అమ్మనబ్రోలు వెంగళరావు, వేమూరు వెంకటేశ్వర్లు, దాసరి తిరుపాలు, మెండా కోటేశ్వరరావు, యలమంద, దస్తగిరి శివ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, చంటి జాలయ్య, అనురాధ, సుందరమ్మ అధ్వర్యంలో మహిళామనులు శ్రావణి సౌజన్యం ధనలక్ష్మి బుజ్జి గొవిందమ్మ దీనమ్మ కాంతమ్మ సుభరత్నం ఈశ్వరమ్మ తదితర మహిళలు,కార్యకర్తలు, అభిమానులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సభ్యులు పాల్గొన్నారు.

## గయాజ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీఎమ్మెల్యే కదిరి బాబురావు

**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 12**

కనిగిరి పట్టణానికి చెందిన షేక్ గయాజ్ ఇటీవల అనారోగ్యంతో అకాలమరణం చెందిన విషయం విదితమే.బుధవారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు గయాజ్ నివాస గృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షేక్ జిలానీ, మాజీ కౌన్సిలర్స్ షేక్ ఫయాజ్, రహిమ్, భారతి,బొట్టు శ్రీను,షరీఫ్, రహమాన్ ,బిసి సంఘం నాయకులుబత్తుల ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# ఘనంగా జనసేన నాయకులు మండలనేని
# చరణ్‌తేజ జన్మదిన వేడుకలు

వాడవాడలా ఏర్పాటైన జన్మదిన ఫ్లెక్సీలు, నరసరావుపేట సెంటర్లో ఆకర్షణమైన భారీ కట్ అవుట్

పండుగ వాతావరణంలో శుభాకాంక్షలు తెలపటానికి తరలివచ్చిన అభిమానులు

వేలాది మంది అన్నదానం, సేవా కార్యక్రమాలు

ఇంతమంది అభిమానులను అందించిన పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు:చరణ్‌తే













**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 12:**

రాజకీయాల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను త్రికరణ శుద్ధిగా పాటిస్తూ పార్టీ బలోపేతానానికి కృషిచేస్తూ, మరోవైపు కష్టాల్లో ఉన్న వారిని నిస్వార్థంగా ఆదుకునే మానవతావాది మండలనేని చరణ్‌తేజ అని పలువురు ప్రముఖులు కొనియాడారు. జనసేన నాయకులు మండల నేని చరణ్‌తేజ జన్మదినాన్ని బుధవారం పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. చరణ్‌తేజకు శుభాకాంక్షలు తెలపటానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తరలి వచ్చారు. వారి సమక్షంలో జన్మదిన కేక్‌లను కట్ చేశారు. పూలమాలలు, శాలువలు కప్పి చరణ్‌తేజను సత్కరించారు. సూదీర్ఘ ప్రాంతాలల్లో ఉన్న పలువురు ప్రముఖులు చరణ్‌తేజకు ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ ప్రధాన వీధుల్లో చరణ్ తేజకు శుభాకాంక్షలు తెలుపుతూ చరణ్‌తేజ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో కలసి ఉన్న పెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో పెద్ద బెలున్లు ఎగుర వేసి కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటు కున్నారు. గడియార స్థంబం సెంటర్‌తో పాటు పలు ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేసి వేలాదిమందికి అన్నదానం చేశారు. పట్టణంలో చరణ్‌తేజ జన్మదినం సందర్భంగా జనసేన జెండాలు రెపరెపలాడాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడంతో చరణ్‌తేజ ముందంజలో ఉన్నారని కొనియాడారు. పార్టీ నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ జనసేన లో యువత భాగస్వామాన్ని పెంచారని గుర్తు చేశారు. ప్రజలతో మమేకమౌతూ, వారికి భరోసా కల్పిస్తూ, వారి అవసరాలు తీరుస్తూ చరణ్‌తేజ గొప్ప నాయకుడిగా ఎదగారని ప్రశంసించారు. భావితతరానికి తన సేవా కార్యక్రమాల ద్వారా చరణ్‌తేజ స్పూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

**ఇంతమంది అభిమానులను అందించిన పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు:చరణ్‌తే**

ఈ సందర్భంగా మండలనేని చరణ్‌తేజ మాట్లాడుతూ వేలాది మందిఅభిమానులనుసంపాదించుకోవటానికి కారణమైన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. తన జన్మదినం సందర్భంగా విస్తృత సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయటంతో పాటు, ఘనంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జనసేనికులు, వీర మహిళలకు రుణపడి ఉంటాన్నారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు కూటమి ప్రభుత్వం మీద నమ్మకం పెట్టుకున్న సగటు ప్రజలకు సేవ చేయటానికి,వారికి అండగా నిలిచేలా పనిచేయాలని కోరారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను గ్రామా, గ్రామానా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి జనసేనపార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పార్టీ సభకు పెద్ద ఎత్తున తరలివెళ్లి అవిర్భావ సభ చరిత్రలో నిలిచిపోయేలా పాటు పడాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఆయన వెబ్సైట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలనేని చరణ్‌తేజ సైన్యం, జనసైనికులు, వీర మహిళ, పలువురు అభిమానులు తదితరులు ఉన్నారు.

## జన సేన యువ నేత చరణ్ తేజకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రెస్ క్లబ్ సభ్యులు



**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 12:**

చిలకలూరిపేట : నియోజకవర్గ జన సేన యువ నాయకులు మండల నేని చరణ్ తేజజన్మదినాన్నిపురస్కరించుకుని ,ఆయన అభిమానులు ఏర్పాటు చేసినటువంటి వేడుకలలో ఆత్మీయ అతిథిగా ప్రెస్ క్లబ్ చిలకలూరిపేట అధ్యక్షుడు అడపా అశోక్ కుమార్ పాల్గొని యువ నేత మండల నేని చరణ్ తేజ కు శాలువ తో సత్కరించి తలపాగను అలంకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతు మానవ సేవే పరమావధి గా ఆపదలో ఉన్నవారిని అదుకోవటం, అపన్న హస్తం అందించటం లో చరణ్ తేజ ముందు వరసలో ఉంటాడని కొనియాడారు, భవిష్యత్తు లో కూడా చరణ్ తేజ సేవా కార్యక్రమాలు ద్వారా పేద ప్రజల ఆశీస్సులు అందుకోని నిండు నూరేళ్ళు పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు .ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సెక్రటరీ దరియా వలి, కొచ్చర్ల చందు, సుందర్ బాబు, మనోహర్, రమేష్, రావిపాటి రాజా, శ్రీ కాంత్, బైర సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన ఆవిర్భావ వేడుకలకు తరలి



**రావాలి చీరాల, పెన్ పవర్, మార్చ్ 12**

ఈనెల 14వ తేదీన పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ వేడుకలకు బాపట్ల పరిసర ప్రాంతాల నుంచి జనసేన కార్యకర్తలు తరలిరావాలని చీరాల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఆమంచి స్వాములు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన సన్నాహ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా గొంతుకై నిలిచేందుకు 12 ఏళ్ల కిందట ఆవిర్భవించిన జనసేన పార్టీ 2024 ఎన్నికల్లో 100% విజయం సాధించిందని చెప్పారు.

## ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం







**చీరాల, పెన్ పవర్, మార్చ్ 12**

వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని చీరాల గడియార స్తంభం సెంటర్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి చీరాల వైసీపీ ఇంఛార్జ్ కరణం వెంకటేష్ బాబు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన కేకును కట్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్, మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు,నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి

### నేర సమీక్షా సమావేశం లో ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ. ఆర్ దామోదర్




**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 12**

జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో బుధవారం ఎస్పీ ఏ. ఆర్ దామోదర్ జిల్లా పోలీసు కార్యాలయంలో నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, మిస్సింగ్, హత్య కేసులు, సాధారణ మరణాలు,పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్స్, ఎన్ఫోర్స్మెంట్, ఇతర కేసులతో పాటు డిపిఓలో వివిధ పెండింగ్ రిప్లయ్స్ సమీక్షించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రాపర్టీ నేరాల కట్టడి, నిందితులు గుర్తింపు, రికవరీకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగ సొత్తు రికవరీ చేయాలని, అనుమానితుల వ్యక్తులను ఫింగర్ ప్రింట్ మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ ద్వారా ఫింగర్ ప్రింట్ సేకరించి తనిఖీ చేయాలన్నారు. మహిళలపై జరిగే నేరాలు, పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేకుర్చాలని, పోలీస్ స్టేషన్ల పరిధిలో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా (డ్రోన్ కెమెరాలతో) పెట్టి కట్టడి చేయాలని ఆదేశించారు. జిల్లాలో గుర్తుతెలియని మృతదేహాలు, కారణం తెలియని మరణం కేసులు, అనుమానాస్పద మృతి కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయా కేసుల్లో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి పూర్తిస్థాయిలో సాక్ష్యాధారాలు సేకరించాలని, ఆర్ఎఫ్ఎస్ఎల్, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులను త్వరితగతిన తెప్పించుకుని పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఎన్ బి డబ్ల్యూ వారెంట్స్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు అందరూ తమ తమ పరిధిలో ఉన్న గ్రామాలను సందర్శించి అక్కడ ఎటువంటి శాంతి భద్రతల సమస్య ఎదురుకాకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తరచూ నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అలాంటి ప్రాంతాలలో పోలీసు అధికారులు విజిబుల్ పోలీసింగ్ ను పెంచి ముందస్తుగానే నేరాలను నియంత్రించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా స్కూళు ,,కాలేజీలో సెల్ఫ్ టెక్నానిక్స్ పై అవేర్నెస్ క్యాంపులు కండక్ట్ చేయాలని, ప్రతి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శక్తి టీం ఏర్పాటు చేయాలని, శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. శక్తి కాల్స్ పై వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు. కెమెరాలు,డ్రోన్ ల యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియచేసి ఏర్పాటు చేసే విధంగా చూడాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటిస్తూ పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలిగి వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలని, మహిళలు,చిన్నారుల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పదించాలని, పోలీస్ శాఖపై నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. ముండ్లమూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వేమపాడు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు వ్యక్తుల వద్ద నాలుగు కేజీల గంజాయి గుర్తించి వారిని అరెస్టు , 72 ట్రాన్స్ఫార్ల దొంగతనం కేసులోని ఆరుగురు ముద్దాయిలను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన దర్శి సీఐ వై రామారావు, ముండ్లమూరు ఎస్సై నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ మహేష్, మరియబాబు, కిరణ్, మహేష్, హోంగార్డులు ఖాసీం, రాజు లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి వారికి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డిఎస్పీలు రాయపాటి. శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, నాగరాజు, ఎస్బీ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, డిసిఆర్బీ సీఐ దేవ ప్రభాకర్, ఐటి కోర్ సీఐ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ నిషేధం పై పట్టణంలో విస్తృత అవగాహన కార్యక్రమం

**శానటరీ ఇన్స్పెక్టర్ రమణ రావు పర్యవేక్షణలో పట్టణ ప్రజలకు అవగాహన...**





**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 12:**

మున్సిపల్ కమిషనర్ పీ.శ్రీ హరి బాబు ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర లో భాగంగా సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ నిషేధం పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తదుపరి శానిటరీ ఇనస్పెక్టర్ ల ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న అన్ని హోల్ సేల్ వ్యాపారస్తులకు ప్లాస్టిక్ నిషేధ సర్కులర్స్ ఇవ్వడం జరిగినది. ఇందులో భాగంగా (120 మైక్రాన్స్ కంటే తక్కువ) ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ధర్మకోల్స్ ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాసులు, ప్లాస్టిక్ జెండాలు మొదలైనవి అమ్ముటకు ప్రభుత్వం నిషేదించడమైనదని,పట్టణంలోని అన్ని ప్లాస్టిక్ హోల్ సెల్ మరియు రిటైల్ షాపుల వారికి సోమవారం నుండి నోటీసులు ఇవ్వడం జరిగింది.అదే విధముగా ప్లాస్టిక్ నిషేధం పై శానటరీ ఇన్స్పెక్టర్ రమణ రావు పర్యవేక్షణలో పట్టణ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోలకు మైకులు ఏర్పాటు చేసి ప్లాస్టిక్ నిషేధం పై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. నిషేధించబడిన సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ ఇతర నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు అమ్మిన లేదా వినియోగించిన, అటువంటి వారిపై 5,000 రూపాయలు జరిమానా మరియు చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని, త్వరలో పట్టణంలో ప్లాస్టిక్ అమ్మకాలు జరిపే హోల్సేల్ రిటైల్ షాపులు తనిఖీ చేపట్టి నిషేధిత ప్లాస్టిక్ నిల్వలు ఉన్న యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు మరియు మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# రోడ్డు పక్కనే స్వచ్ఛ సంకల్పం



**పెన్ పవర్ కారంపూడి మార్చి 12**

ప్రభుత్వం గ్రామాలలోని వ్యర్ధాలను తొలగించి సంపద కేంద్రాలకు తరలించి సంపదను తయారు చేయాలని ఆదేశిస్తే, గ్రామాలలోని వ్యర్ధాలు ఎక్కడపడితే అక్కడే ఉన్నాయి. మండలంలోని గాదెవారిపల్లె గ్రామంలో స్వచ్ఛ సంకల్పం వాహనం గత పది రోజుల నుంచి రోడ్డు పక్కనే ఉండటం పలువురిని ఆశ్చర్యపరిచింది. గ్రామంలో ఎలాంటి వ్యర్ధాలు సంపద కేంద్రాలకు పంపిన దాఖలాలు కనబడటం లేదు. వాహనం మాత్రం నన్ను రోడ్డు పక్కన నుండి తీసుకు వెళ్ళమంటూ ప్రాధేయ పడుతుంది. గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. స్వచ్ఛ సంకల్పం నన్ను రోడ్డు పక్కనే వదిలేస్తారా అంటుంది.

# P4 సర్వే పై కసరత్తు

### ఐదుగురు సచివాలయం సిబ్బందికి మెమోలు జారీ



**పెన్ పవర్ కారంపూడి మార్చి 12**

దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించి వారికి ఆర్థికంగా ఆదుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్) P4 సర్వే ..సర్వేపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు గ్రామ స్థాయిలో ఉన్న సచివాలయ సిబ్బందితో సర్వే చేస్తున్నారు. మండలంలో 15,841కుటుంబాలు ఉండగా ఇప్పటికీ 10,261 పూర్తి చేసినట్టు ఎంపీడీవో గంటా శ్రీనివాస్ రెడ్డి బుధవారం తెలిపారు. 60 శాతం P4 సర్వే పూర్తి చేయగా 5580 కుటుంబాలకు సర్వే చేయాల్సి ఉంది. P4 సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఐదుగురు సచివాలయ సిబ్బందికి మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు P4 సర్వే పూర్తి అయితే దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి చేసి వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తూ, ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు, పి ఫోర్ సర్వే ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

# స్వచ్ఛ చిలకలూరిపేటకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలి

### పాలిథిన్ కవర్ల నిషేధం 100శాతం అమలు చేసేలా చర్యలు

### ప్రజల సహకారంతో ప్లాస్టిక్ హరిత చిలకలూరిపేట గా మారుద్దాం



**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 12:**

చిలకలూరిపేట:స్వచ్ఛ చిలకలూరిపేటలో భాగంగా 100శాతం పాలిథిన్ కవర్ల నిషేదానికి ప్రజలు, వ్యాపార వర్గాల వారు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు చెప్పారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛా ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడోవ శనివారాన్ని నిర్వహిస్తున్నారని, చిలకలూరిపేట పురపాలక సంఘ పరిధి మార్చి నెలలో ప్లాస్టిక్ రహిత చిలకలూరిపేటగా మార్చటానికి సింగిల్ యూజ్ పాలిథిన్ కవర్లను నిషేదిస్తున్నట్లు వెల్లడించారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్రంగా హాని కలిగించే పాలిథిన్ కవర్ల నిషేదానికి ప్రజలు, వ్యాపార, వాణిజ్య వర్గాల వారు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. వ్యాపార వర్గాల వారు పాలిథిన్ కవర్ల స్థానంలో జనపనార, గుడ్డ సంచుల వినియెగించేలా ప్రోత్సహించాలని, ప్రజల కూడా ఇంటి నుంచి బయటకు వచ్చేక్రమంలో గుడ్డ సంచులను తెచ్చుకొని వాటిలోనే సరకులు, ఇతర వస్తువులను తీసుకువెళ్లాలని సూచించారు. పట్టణాన్ని స్వచ్ఛ చిలకలూరిపేటగా రూపొందించే క్రమంలో ప్రజలు, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.





# రూతు డైక్ మెన్ కాలని వాసుల సమస్యలు పరిష్కరించండి...?

**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 12:**

ఊరు మొత్తం శుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికులు వారు నివాస ప్రాంతాల వద్ద వసుతులు లేవు..? ఇంకా పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రమే..! కనీసం సచివాలయం సిబ్బంది కూడా కాలని వైపు కన్నెత్తి చూడరు.ప్రజా ప్రతినిధుల పర్యటన ఉంటే తప్ప అటువైపు చూడని అధికారులు,పట్టణంలోని వేలూరు రోడ్డులో ఉన్న రూతు డైక్ మెన్ కాలని లోని సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు, ఆ కాలని వాసూలు వేడుకుంటున్నారు. డైక్ మెన్ కాలని ఏర్పడి దాదాపు దశాబ్ద కాలం దాటిన కూడా నేటికీ విధి లైట్లు మాట దేవుడు ఎరుగను మా ఇళ్ల ముందు కరెంటు స్తంభాలు కూడా లేవని వాపోతున్నారు, అంతే కాకుండా తెల్లవారు ఝామున పారిశుధ్య పనులకు వెళ్ళే సమయంలో విధి లైట్లు లేని కారణంగా రోడ్డు పైన ఉన్న పెద్ద పెద్ద పాములు కనబడటం లేదని ఒక్కొక సారి వాటి బారిన పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి అని అదే విధంగా రాత్రి సమయాల్లో ఇంటికి వచ్చే సమయాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంటుందని అక్కడ స్థానికులు చెబుతున్నారు,అంతే కాకుండా పారిశుధ్య పనుల నిర్వహణ అయితే దాదాపు మృగం అనే చెప్పాలని అన్నారు. ఎప్పుడైనా వారి ద్వారా వీరి ద్వారా కాళ్ళు అరిగేలా తిరిగి అధికారుల దృష్టి కి తీసుకెళితే వారికి తొచ్చినప్పుడు 15 రోజులకో 20 రోజులకు ఒకసారి చర్చి దగ్గర సబ్ స్టేషన్ పరిధిలో మురుగు కాల్వను శుభ్ర పరిచి అక్కడే రోడ్డు వెంట వేసిన చెత్తను తరలించడం జరుగుతుందని వారు తెలిపారు.



ఇదే విధముగా గతంలో మంచినీటి సమస్య కూడా ఉండేదని ఎమ్మెల్యే పుల్లారావు దృష్టికి తీసుకెళ్లగా మంచినీటి సమస్య పరిష్కారం అయ్యేవరకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు వచ్చాయని ఇప్పుడు మున్సిపల్ కుళాయిల ద్వారా నీళ్లు వస్తున్నాయని చెప్పారు,పైపు లైన్ వేసేందుకు రోడ్డున పగలు కొట్టిన చోట రోడ్డు మరమ్మతులు చేయక పోవడం వలన చీకటిలో టూ వీలర్ చక్రాలు గుంటలలో పడి క్రిందపడి కాళ్ళు, చేతులు, తలకు, గాయాలు అయ్యాయి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,వేలూరు మెయిన్ రోడ్డు నుండి కాలనిలోకి వచ్చే రోడ్డు కి విధి లైట్లు ఏర్పాటు చేయాలని ,అదే విధముగా కాలని లో పలు బజారులకు కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి విధి లైట్లు అమర్చలని కాలని వాసుల అధికారులను వేడుకుంటున్నారు.

# మున్సిపాలీటీల్లో గ్రామాలవిలీనంపై గత ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించింది

**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 12:**



మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనానికి సంబంధించిన జీవోపై రాష్ట్రంలో పలుచోట్ల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందని, గత ప్రభుత్వం అనాలోచితంగా, స్థానికుల అభిప్రాయాలకు విరుద్ధంగా విలీనప్రక్రియ చేపట్టిందని, వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్ర టెక్స్ టైల్ రంగానికి పవర్ సబ్సిడీలు ఇచ్చి ఆదుకోవాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. బుధవారం ఆయన అసెంబ్లీలో పురపాలికల్లో గ్రామాల విలీనం, రాష్ట్ర టెక్స్ టైల్ రంగ దుస్థితిపై మాట్లాడుతూ, ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేశారు. “ చిలకలూరిపేట మున్సిపాలిటీలో కొన్ని గ్రామాలను నిబంధనలకు విరుద్ధంగా విలీనం చేశారు. పసుమర్రు, మానుకొండవారిపాలెం, గణపవరం గ్రామస్తులు విలీనాన్ని ఏకపక్షంగా తిరస్కరించారు. ఈ సమస్యను గౌరవ మంత్రివర్యులు వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాం. అమృత్ పథకం తొలిదశలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల్ని అమృత్-2లో పూర్తిచేయాలి. మున్సిపల్ శాఖా మంత్రిగా నారాయణ బాధ్యతలు చేపట్టాక మున్సిపాలిటీలు గాడిలో పడ్డాయి. అమృత్-1 పథకం పనులు కొన్నిచోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయని, అమృత్ -2 పథకంలో అయినా ఆ పనులన్నీ త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని కోరుతున్నాను. ఇటీవల 01-04-2025 నుంచి బిల్లులచెల్లింపును నేరుగా మున్సిపాలిటీలే చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. ఈ నిర్ణయం వల్ల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతా యి. చిలకలూరిపేటలో గాంధీపార్క్ ను కూడా గతప్రభుత్వం తాకట్టు పెట్టింది. అభివృద్ధి ఆపేసి ఆ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన మంత్రి ప్రజల్ని దోచుకోవడమే పనిగా పెట్టుకు న్నారు. బయో మైనింగ్ టెండర్లు దక్కించుకొని పనులు చేయకుండా డబ్బులు డ్రా చేసుకున్న జ్ఞానేశ్వర ఇంజనీరింగ్ సంస్థను ప్రభుత్వం బ్లాక్ లిస్ట్ లో పెట్టాలి. జ్ఞానేశ్వర ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బయోమైనింగ్ పేరుతో టెండర్లు రాష్ట్రవ్యాప్తంగా కిలో చెత్తకు రూ. 7.50లు చొప్పున టెండర్లు దక్కించుకొంది. రూ. 50కోట్లకు మాత్రమే పనులు చేసి, బయో మైనింగ్ చేయకుండా చెత్తను డంపింగ్ యార్డులకే పరిమితం చేశారు. మంగళగిరి మున్సిపాలిటీ పరిధిలోని తాడేపల్లిలో రూ. 17కోట్లు డ్రా చేశారు. కొందరు అధికారులు కూడా ఈ సంస్థకు సహాయసహకారాలు అందించారు. ఈజీ మనీకి అలవాటుపడిన ఈ సంస్థను తక్షణమే బ్లాక్ లిస్ట్ లో పెట్టి, పనులు చేయకుండా చేసినట్టుగా డబ్బులు డ్రా చేసుకున్నందున ఆ సొమ్మును రికవరీ చేయాలని కోరుతున్నాను. మదనపల్లి, బద్వేల్, శ్రీకాకుళం మున్సిపాలిటీల్లో బిల్లులు డ్రా చేసుకునే ప్రయత్నాలు సదరు సంస్థ చేస్తోంది. సమాజానికే ప్రమాదకరమైన కంపెనీ జ్ఞానేశ్వర సంస్థ, అలాంటి వాటిని ప్రోత్సహించడం మంచిదికాదు.

**వెంటిలేటర్ పై ఉన్న టెక్స్ టైల్ రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..:** టెక్స్ టైల్ రంగం వెంటిలేటర్ పై ఉందని, ఆ రంగాన్ని కాపాడే బాధ్యత గౌరవ ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రిపై ఉంది. స్పిన్నింగ్, వీవింగ్, ప్రెస్సింగ్, జిన్నింగ్ వంటి కాటన్ రిలేటెడ్ ఇండస్ట్రీ మొత్తం నేడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నష్టాలలో కూరుకుపోయింది. తెలంగాణ, తమిళనా డు, గుజరాత్, ఉత్తరప్రదేశ్, చత్తీస్ ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కాటన్ ఇండస్ట్రీస్ కు పవర్ సబ్సిడీలు ఇస్తున్నారు. అదేవిధమైన ఆలోచన కూటమిప్రభుత్వం చేయాలని కోరుతున్నాం. ఈ రంగంపై ఆధారపడి 2లక్షల మంది బతుకుతున్నారు. కాబట్టి ఈ సమస్యపై విద్యుత్ శాఖ మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతున్నాం. ప్రభుత్వం స్పందించకపోతే, టెక్స్ టైల్ రంగం మొత్తం మూతపడే ప్రమాదముంది. ఇప్పటికే చాలా చోట్ల కంపెనీలు నష్టాలను తట్టుకోలేక మూసివేత దిశగా నడుస్తున్నాయి” అని ప్రత్తిపాటి సభసాక్షిగా వాస్తవాలు తెలియచేశారు.

# మంచి నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలి.: సంజీవరావు




**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 12:**

నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం ఎంపీడీవో స్వరూప రాణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా మండల ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్య శాఖ అధికారి సంజీవరావు పాల్గొన్నారు. ఈ సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి పనులపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా నాదెండ్ల మండలంలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు వారి వారి గ్రామాల్లో ఉన్న పలు సమస్యలను ఈ సందర్భంగా సభ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు స్పందించారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్య శాఖ అధికారి సంజీవరావు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం వచ్చినందున గ్రామాల్లో మంచి నీటి సరఫరాపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. మంచి నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన వారికి వివరించారు. దీనితో పాటుగా అంటు వ్యాధులు ప్రభలకుండా పారిశుధ్య పనులు నిరంతరం నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ప్రస్తుతం మండలంలో మంచి నీటి ఎద్దడి లేదని, వేసవికి సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని పలువురు బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ పి. సిద్ధలింగ మూర్తి, ఎంపీపీ తలతోటి రాణి, తహశీల్దార్ ఆలపాటి వెంకట రమణ, వ్యవసాయ అధికారి అందె హరిప్రసాద్, వైద్యురాలు జ్ఞానేశ్వరి, పశువైద్యులు, ఏపీవో రామారావు, ఎపిఎం రమేష్ బాబు, పీఆర్ ఏఈ కిలారు వెంకటేశ్వర రావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, అంగన్వాడీ పర్యవేక్షకురాలు నిర్మల కృష్ణ మాల, అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సైదారావు, కెనెడీ, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి నిర్మాణానికి రూ.64వేల కోట్ల ఖర్చు

**విజయవాడ, మార్చి 12, పెన్ పవర్:** రాజధాని నిర్మాణానికి దాదాపు రూ.64వేల కోట్లు ఖర్చవుతుందని మంత్రి నారాయణ ఏపీ అసెంబ్లీలో ప్రకటించారు. రాజధాని నిర్మాణం కోసం బహుళ పక్ష ఏజెన్సీలు, భూములు అమ్మడం,లీజుల ద్వారా నిధులు సేకరిస్తామన్నారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు.అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఏజీసీ)లో ఇళ్లు,భవన నిర్మాణాలు,ట్రంక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ మౌళిక సదుపాయాల అభివృద్ధి కోసం 64,721.48 కోట్లు ఖర్చవుతుందని వివరించారు. .ఈ నిధులను వివిధ రూపాల్లో సేకరించి అమరావతి నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు.బహుళ పక్ష ఏజెన్సీలు, బ్యాంకుల నుండి లోన్ లు,కేంద్ర ప్రభుత్వం నుండి గ్రాంటులను పొందడం ద్వారా అమరావతికి నిధుల సేకరిస్తున్నామని చెప్పారు. రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లను దశల వారీగా మూడేళ్లలో అప్పగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.2019-24 మధ్య విధానపరమైన అనిశ్చితుల కారణంగా ఈ ప్రక్రియలో జాప్యం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు గారి మీద నమ్మకంతో 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలు రైతులు ప్రభుత్వానికి ఇచ్చారని...ప్రపంచంలోనే టాప్ 5 రాజధానిగా అమరావతి ఉండాలని ముఖ్యమంత్రి గారు ఈ ప్రాజెక్ట్ డిజైన్ చేసారని చెప్పారు.రాజధాని నిర్మాణానికి అయ్యే ఖర్చులో ప్రపంచ బ్యాంకు,ఏడీబీ కలిసి 13,400 కోట్లు రుణం ఇస్తున్నాయని చెప్పారు. ఐఈచి బ్యాంకు 5 వేల కోట్లు లోన్ ఇస్తుందని, హడ్కో నుంచి 11000 కోట్లు రుణం రెండు మూడు రోజుల్లో వస్తుందని చెప్పారు.కేంద్రం గ్రాంట్ కింద మరో 1560 కోట్లు ఇస్తుందని అమరావతి లోపల భూములు అమ్మడం,లీజు ద్వారా అలాగే జాతీయ,అంతర్జాతీయ మార్కెట్ లో తక్కువ వడ్డీకి లోన్ తీసుకోవడం ద్వారా మిగిలిన నిధులు సమీకరిస్తామని మంత్రి నారాయణ అసెంబ్లీలో తెలిపారు.అమరావతిలో 106 ప్రభుత్వ,ప్రభుత్వేతర రంగ సంస్థలు తమ కార్యాలయాలు ఏర్పాటుచేసేందుకు సిద్దంగా



ఉన్నాయన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభించేందుకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ లు ఇచ్చేందుకు అథారిటీ అనుమతి తీసుకుంటున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు.అమరావతిలో ట్రంక్ రోడ్లు(మెయిన్ రోడ్లు) 165 అడుగులు,185 అడుగులతో రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. ఎల్పీఎస్ రోడ్లు మూడేళ్లలో పూర్తి చేస్తామని సగానికి పైగా నిర్మాణం జరిగిన అధికారుల భవనాలు ఏడాదిన్నరలో...మిగతావి రెండేళు ,,అసెంబ్లీ,సెక్రటేరియట్,హైకోర్టు నిర్మాణాలను మూడేళ్లలో పూర్తి చేస్తామని మంత్రి నారాయణ చెప్పారు.2014-19 మధ్యలో అమరావతిలో 131 సంస్థలకు 1277 ఎకరాలు కేటాయించగా....గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలతో కొన్ని సంస్థలు వెనక్కి వెళ్లిపోయాయని అన్నారు.గతంలో కేటాయించిన మొత్తం 31 సంస్థలకు 629.3 ఎకరాలు కొనసాగిస్తుండగా, రెండు సంస్థలకు 5.5 ఎకరాలు వేరొక ప్రాంతాల్లో కేటాయిస్తున్నామన్నారు.మరో 16 సంస్థలకు గతంలో చేసిన కేటాయింపుల్లో మార్పులు చేయడంతో పాటు వేరొక చోట 48.74 ఎకరాలు కేటాయించామన్నారు.మరోవైపు 13 సంస్థలకు 177.24 ఎకరాలు గతంలో చేసిన కేటాయింపులు రద్దు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మొత్తంగా 683.6 ఎకరాలను వివిధ సంస్థలకు కేటాయిస్తూ ఈనెల 10న జరిగిన కేబినెట్ సబ్ కమిటీ భేటీలో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.అమరావతి నిర్మాణానికి 30 వేల ఎకరాలు కావాలని జగన్ గారు ఇదే అసెంబ్లీ సాక్షిగా చెప్పారని ప్రభుత్వం మారగానే ప్లేటు ఫిరాయించి మూడు ముక్కలాట ఆడి ఎక్కడా రాజధాని చేయలేదన్నారు.గత ఐదేళ్లలో రాజధాని కి భూములిచ్చిన రైతులను నానా ఇబ్బందులు పెట్టారని శాడిజంతో కక్ష సాధింపుతో ఆర్ - 5 జోన్ చేసి 50 వేల మందికి ఒక సెంట్ భూమి ఇచ్చారని వారికి కూడా ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నామని చెప్పారు.వేరొక చోట స్థలం కేటాయించి అమరావతి భూములను రాజధాని కోసం తీసుకుంటామన్నారు.

# యాక్షన్.. రియాక్షన్...

**తిరుపతి, మార్చి 13, పెన్ పవర్:** వైసీపీ ప్రభుత్వం యాక్షన్‌కు ఇప్పుడు ఎన్ డీఏ ప్రభుత్వం రియాక్షన్. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చెలరేగిపోయి, తమను ఇబ్బంది పెట్టిన నేతల టార్గెట్‌గా పావులు కదుపుతున్నారనేది ఓపెన్ సీక్రెట్. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా పని చేసిన వారితో పాటు పార్టీని భుజానికెత్తుకుని.. అప్పటి ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడిన నేతలపై వరుస కేసులు బుక్ అవుతున్న పరిస్థితి. ఎవరికీ మినహాయింపు ఉండదన్నట్టుగా అడుగులు వేస్తోంది కూటమి ప్రభుత్వం.లేటెస్ట్‌గా మాజీ ఎంపీ విజయసాయికి ఏపీ సీఐడీ నోటీసులు ఇచ్చింది. రాజకీయ సన్యాసం తీసుకున్నప్పటికీ ఆయనను వదిలట్లేదన్న చర్చ జరుగుతోంది. కాకినాడ పోర్టు వాటాల బదిలీ ఇష్యూలో విచారణకు హాజరుకావాలంటూ విజయసాయిరెడ్డికి ఏపీ సీఐడీ నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తర్వాత నెక్స్ట్ ఎవరు? అన్న ప్రశ్నకు సినీ నటుడు పోసాని కృష్ణమురళి అరెస్ట్‌తో సస్పెన్స్‌కు తెరదించినట్లు అయింది. ఇప్పుడు పోసాని తర్వాత ఉమ్మడి కృష్ణా లేదా రాయలసీమ నేతలు క్యూలో ఉండొచ్చన్న టాక్ వినిపిస్తుండగా.. ఎవరి ఊహాలకు అందకుండా వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డి కేసు తెరమీదకు వచ్చింది.కాకినాడ సీపోర్టు వాటాలను బలవంతంగా లాక్కున్నారనే ఆరోపణలపై గతేడాది డిసెంబర్‌లో విజయసాయిరెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసులో ఇప్పటికే ఈడీ విచారణను ఎదుర్కొన్న విజయసాయిరెడ్డికి ఇప్పుడు సీఐడీ నుంచి పిలుపు వచ్చింది.కాకినాడ సీపోర్టు యాజమాని కేవీ రావు ఫిర్యాదుతో విజయసాయిరెడ్డితో పాటు పలువురిపై కేసు నమోదైంది. అయితే ఈ విషయంపై దర్యాప్తు సంస్థలు ఫోకస్ చేయడంతో కాకినాడ పోర్టు వాటాలు దక్కించుకున్న అరబిందో కంపెనీ సీపోర్టు వాటాలను వెనక్కి ఇచ్చింది. పెద్దల సమక్షంలో రాజీ కుదిరినా, కేసు మాత్రం వాపసు తీసుకోకపోవడంతో సీఐడీ రంగంలోకి దిగింది. దాంతో వైసీపీ మాజీ నేతకు ఉచ్చు బిగించేలా అడుగులు వేస్తోందని అంటున్నారు.వాస్తవానికి కేసు రాజీ అయిన తర్వాత పోలీసు చర్యలు ఉండవని విజయసాయి భావించినట్లు చెబుతున్నారు. కానీ వాటాలు రిటర్న్ ఇవ్వడంతోనే ఇంకా ఇరికిపోయారన్న చర్చ జరుగుతోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విజయసాయిరెడ్డి చంద్రబాబుపై అడ్డగోలుగా మాట్లాడారని.. టీడీపీ నేతలను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని




కూటమి నేతలు చెబుతున్నారు. కాబట్టి రాజకీయాల్లో ఉన్నా లేకున్నా అడ్డగోలుగా వ్యవహరించినోళ్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదంటున్నారు.కాకినాడ సీపోర్టు కేసే కాదు.. మాజీ స్పీకర్ కోడెల కేసు కూడా..విజయసాయిరెడ్డి మెడకే చుట్టుకునేలా కనిపిస్తోంది. 2019లో కోడెల శివప్రసాదరావు సూసైడ్ చేసుకున్నారు. కోడెల ఆత్మహత్య వెనక అప్పటి వైసీపీ ప్రభుత్వం వేధింపులు ఉన్నాయని టీడీపీ నేతలు ఆరోపించారు. అలా రాజకీయ రచ్చ నడుస్తూ వచ్చింది. ఇంతలోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కేసు మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చేసింది. కోడెల ఆత్మహత్య వెనక వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉన్నారని ఆరోపిస్తూ టీడీపీ నేతలు నరసరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆరేళ్ల క్రితం నాటి కోడెల కేసు ఇప్పుడు మళ్లీ జీవం పోసుకుని ఏ మలుపు తిరుగుతుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. రాజకీయాలకు గుడ్‌బై చెప్పినప్పటికీ కాకినాడ పోర్టు వాటాల వ్యవహారం, కోడెల కేసు విజయసాయిరెడ్డికి తలనొప్పిగా మారే అవకాశం ఉంది.ఇక వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ఆరోపిస్తోంది కూటమి. ఈ విషయంపై ఏపీ అసెంబ్లీలో చర్చ జరిగిన తెల్లారే ఏసీబీ విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. ఆడుదాం ఆంధ్రా కోసం గత ప్రభుత్వం రూ.120 కోట్లు విడుదల చేస్తే..
అందులో మేజర్ అమౌంట్ పక్కదారి పట్టినట్లు అలిగేషన్స్ చేస్తున్నారు టీడీపీ నేతలు.ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం చేపట్టినప్పుడు ఏపీ స్పోర్ట్స్ మినిస్టర్‌గా ఆర్కే రోజా ఉన్నారు. ఆమె టర్మ్‌లోనే పెద్దఎత్తున స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ వస్తున్నారు కూటమి నేతలు. ఇప్పుడు ఏసీబీ విచారణతో రోజా చుట్టూ ఉచ్చు బిగించే ప్రయత్నం జరుగుతోందన్న టాక్ వినిపిస్తోంది. రోజా కూడా వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు, లోకేశ్, పవన్‌పై సెటైర్లు వేయడం వంటివి గుర్తు చేస్తున్నారు.ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అప్పుడప్పుడు ప్రెస్‌మీట్లు పెడుతూ కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ వస్తున్నారు. ఇలా గత సర్కార్ హయాంలో చెలరేగిన వారిపై వరుస కేసులు నమోదవుతూ వస్తున్నాయి. నెక్స్ట్ టార్గెట్ ఎవరో చూడాలి మరి.

# కనీస అవసరమైన ఆధార్ కార్డుకు దూరంగా గిరిజనులు

**గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది**

**అసెంబ్లీలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**

**అమరావతి: పెన్ పవర్:** సర్వేపల్లి నియోజకవర్గంలోని పైనాపురం పంచాయతీలో రెండు గిరిజన కాలనీలున్నాయి.. చిన్న సంఘం కాలనీలో 88 మందికి ఆధార్ కార్డులు, 60 కుటుంబాలకు రేషన్ కార్డులు లేవు, 19 మందికి అర్హత ఉన్నా పింఛన్ రావడం లేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. తోటపల్లిగూడూరు మండలం మాచర్లవారిపాళెం సచివాలయం పరిధిలో మాచర్లవారిపాళెం, మల్లికార్జునపురం ఉన్నాయి..రెండు గ్రామాల్లో కలిసి 180 మందికి ఆధార్ కార్డులు లేవు. ఆధార్ కార్డులు లేక అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పేదలు దూరమవుతున్నారు. కలెక్టర్ తో పాటు ఐటీడీఏ అధికారులు, ఎంపీడీఓలు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించాం. సచివాలయ ఉద్యోగులు ఐదేళ్లు కార్యాలయాలకు పరిమితమై ప్రజల సమస్యలపై దృష్టి పెట్టలేదు . పేదల కోసం ఒక్కో సచివాలయం పరిధిలో 11 మందికి ప్రభుత్వం ఉద్యోగాలిస్తే ప్రజల కనీస అవసరాలను పట్టించుకోరా..అని ప్రశ్నించాం. ప్రతి ఇంటికి వెళ్లి ఆధార్ కార్డులు లేని వారి వివరాలను సేకరించడంతో పాటు వారికి ఆధార్ నంబర్ జారీ అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించాం. సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు 40 వేల మందికి పైగా గిరిజనులున్నారు..ఆధార్ కార్డులు లేని వారిలో 90 శాతం మంది గిరిజనులే . ప్రతి పంచాయతీ

పరిధిలో 100 శాతం మంది ఆధార్ కార్డులు పొందేలా లక్ష్యం పెట్టుకుని ముందుకెళుతున్నాం. అమాయకులు, నిరక్షరాస్యులైన గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను కూడా పెద్దలు లాగేసుకుంటున్నారు. గత ఐదేళ్లలో గిరిజనులకు జరిగిన అన్యాయాలపై విచారణ జరిపి వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.

# వాటాల కోసం ఎమ్మెల్యే డిమాండ్

**ఒంగోలు, మార్చి 13, పెన్ పవర్:** ఏపీలో కొందరు ఎమ్మెల్యేల వ్యవహార శైలి వివాదాస్పదంగా మారుతోంది. అనవసర విషయాల్లో జోక్యం వద్దు అంటూ సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా సరే కొందరు ఎమ్మెల్యేలు పెడచెవిన పెడుతున్నారు. అధినేత ఆదేశాలను పట్టించుకోవడం లేదు. తాజాగా ఓ ఎమ్మెల్యే వ్యవహార శైలి వివాదాస్పదం అవుతోంది. తన నియోజకవర్గంలో జరుగుతున్న రామాయపట్నం పోర్టు పనుల్లో తనకు వాటాలు కావాల్సిందేనని ఆ ఎమ్మెల్యే తేల్చి చెప్పారు. అయితే అందుకు ఆ కాంట్రాక్టు సంస్థ నిరాకరించడంతో తన ప్రతాపాన్ని చూపుతున్నారు. పోర్టు నిర్మాణానికి తరలిస్తున్న కంకర, ఇసుక లారీలను అడ్డగిస్తున్నారు. తప్పుడు కేసులతో వేధింపులకు దిగుతున్నారు. ప్రతి ట్రిప్పునకు వెయ్యి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఈ వివాదం సీఎం కార్యాలయానికి చేరింది. సీఎంవో నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన ఆ ఎమ్మెల్యే వెనక్కి తగ్గడం లేదు. దందాను కొనసాగిస్తుండడం హాట్ టాపిక్ అవుతోంది.రామాయపట్నం పోర్టు నిర్మాణం పై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. పనులను శరవేగంగా పూర్తి చేయాలని ప్రయత్నిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పోర్టు నిర్మాణంలో దందా జరిగింది. అది పనులపై ప్రభావం చూపింది. ఆ పరిస్థితి లేకుండా చూస్తామని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. స్వయంగా టిడిపి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సరికొత్త దందాకు దిగినట్లు టిడిపి అనుకూల మీడియాలోనే ప్రచారం ప్రారంభమైంది. పోర్టు నిర్మాణ పనుల్లో తనకు వాటా ఇవ్వాలని ఇంటూరి గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అందుకు సదరు కాంట్రాక్టు సంస్థ సమ్మతించలేదు. దీంతో ఇంటూరి తన ప్రతాపాన్ని చూపడం మొదలుపెట్టారు. భయపెట్టి అయినా సరే కాంట్రాక్టు సంస్థను దానికి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. పోర్టు నిర్మాణాల కోసం కంకర, ఇసుక తెస్తున్న లారీలకు అడ్డం పడ్డారు. నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ వెళ్లకుండా చేయడం ద్వారా నిర్మాణ సంస్థను తన దారికి తెచ్చుకోవాలన్నది ఆయన లక్ష్యంగా కనిపిస్తోంది.వాటాల కోసం పెద్ద డిమాండ్లు తెరపైకి తెచ్చారు ఇంటూరి నాగేశ్వరరావు అవి వర్కౌట్ కాకపోయేసరికి.. నయా దందాకు దిగారు. కాదంటే ఒక్కో లారీ ట్రిప్పునకు వెయ్యి రూపాయల చొప్పున తనకు చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే సదరు సంస్థ ఒప్పుకోకపోవడంతో పోలీసులను అడ్డం పెట్టుకొని లారీలను రోడ్డుపై నిలిపివేయిస్తున్నారు. తప్పుడు కేసులు పెడుతున్నారు. పోర్టు పనులు ముందుకు సాగకుండా అరాచకం సృష్టిస్తున్నారు. అయితే జిల్లాలో జరుగుతున్న ఈ దందా గురించి ప్రకాశం జిల్లా నేతలు ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. చాలామంది ఇప్పటికే నేరుగా ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. దీనిపై సీఎంఓ సీరియస్ గా స్పందించింది. జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అయితే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అరాచకం మాత్రం ఆగలేదని తెలుస్తోంది. దీనిపై సీఎం చంద్రబాబు ఎలా స్పందిస్తారో చూడాలి.

# తల్లికి వందనానికి కండిషన్లు...




**నెల్లూరు, మార్చి 13, పెన్ పవర్:** కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ను శాసనసభలో పెట్టారు. సంక్షేమ పథకాలకు కేటాయింపులు చేశారు. అయితే లేనిపోని పథకాలపై దృష్టి పెట్టకుండా.. ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చే పథకాలు, ప్రధానమైన వాటినే అమలు చేయాలని చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చారు.కూటమి అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతోంది. పాలనతో పాటు సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. అయితే తొలి మూడు నెలల సొంత శాఖలపై పట్టు సాధించేందుకు మంత్రులు ప్రయత్నించారు. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అమరావతి రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. మధ్యలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు పల్లె పండుగ వంటి కార్యక్రమాలు నిర్వహణపై ఫోకస్ చేసింది. అయితే పాలన వరకు ఒకే కానీ సంక్షేమ పథకాల విషయంలో మాత్రం వెనుకబడింది. దీనిని గుర్తించిన సీఎం చంద్రబాబు ప్రజల్లో ప్రభావితం చేసే సంక్షేమ పథకాల అమలుకు నిర్ణయం తీసుకున్నారు.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ను శాసనసభలో పెట్టారు. సంక్షేమ పథకాలకు కేటాయింపులు చేశారు. అయితే లేనిపోని పథకాలపై దృష్టి పెట్టకుండా.. ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చే పథకాలు, ప్రధానమైన వాటినే అమలు చేయాలని చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చారు. సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల అభిమానాన్ని చూరగొనాలని చంద్రబాబు స్ట్రాంగ్ గా డిసైడ్ అయినట్లు సమాచారం. ముఖ్యంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి.. కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూలత మార్చుకోవాలని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. దీనిపై ఇప్పటికే అంతర్గత సర్వేలు కూడా పూర్తి చేసిన చంద్రబాబు ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పథకాన్ని అమలు చేయాలని చూస్తున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పేరిట పథకాన్ని అమలు చేసేవారు. ఇంట్లో ఒక పిల్లాడికి మాత్రమే పథకం వర్తింపజేశారు. ఏటా చదువుకు ప్రోత్సాహం కింద పదిహేను వేల రూపాయల మొత్తాన్ని అందించేవారు. అయితే తొలి సంవత్సరం వెయ్యి రూపాయలు కోత విధించారు. తరువాత ఏడాది రెండు వేల రూపాయలు తగ్గించేశారు. అయితే తాము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మంది చదువుకు 15000 రూపాయల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చారు చంద్రబాబు. ఇప్పుడు ఆ హామీ అమలు చేసేందుకు సిద్ధపడుతున్నారు. అయితే ఈ పథకం అమలు చేస్తే ప్రజల్లో ఒక రకమైన మార్పు ఖాయమని.. కూటమి ప్రభుత్వం పట్ల సానుకూలత కూడా వస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఇప్పటికే అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. గ్రామాల్లో మౌలిక వసతులకు పెద్ద పీట వేస్తూ పనులు చేపడుతున్నారు. ఇంకోవైపు అమరావతి రాజధాని నిర్మాణ పనులు ఊపందుకుంటున్నాయి. ఒకవైపు అభివృద్ధి చూపిస్తూనే.. ఇంకోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తే పాజిటివ్ రావడం ఖాయమని చంద్రబాబు బలంగా నమ్ముతున్నారు. అందుకే ఎంత కష్టమైనా ప్రధాన సంక్షేమ పథకాలను అమలు చేయాలని చూస్తున్నారు. మరి ఇందులో ఎంతవరకు సఫలీకృతం అవుతారో చూడాలి.

# నష్టాల్లో ఐటీ స్టాక్స్...

**ముంబై మార్చి 13, పెన్ పవర్:** భారత ఐటీ కంపెనీల షేర్లు నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. అమెరికా మార్కెట్లు సోమవారం కుప్పకూలడంతో దేశీయ టెక్ స్టాక్స్ పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోంది. డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార టారిఫ్‌ల ప్రకటన, అమలుతో అమెరికాలో మాంద్యం వస్తుందనే కొత్త భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో అక్కడి స్టాక్ మార్కెట్లో పడిపోతున్నాయి. అలాగే అమెరికా మాంద్యంలోకి వెళ్లే అవకాశం ఉందా అన్న ప్రశ్నకు ట్రంప్ సమాధానం దాటవేయడం ఇన్వెస్టర్లను తీవ్ర భయాందోళనకు గురి చేస్తోంది. అగ్రరాజ్యంలో ఆర్థిక వృద్ధి మందగించిన క్రమంలోనే డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రతికూల పడుతోంది. అమెరికా స్టాక్ మార్కెట్ల పని తీరుపైనే భారత ఐటీ స్టాక్స్ ఆధారపడి ఉంటాయి.అమెరికా వృద్ధి నెమ్మదించినట్లయితే భారత ఐటీ కంపెనీల రెవెన్యూ పడిపోతుంది. అందుకే భారత ఐటీ కంపెనీల షేర్లపై ప్రతికూల ప్రభావం పడుతుంది. మంగళవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో ఐటీ స్టాక్స్ నష్టాల్లో ట్రేడయ్యాయి. నిఫ్టీ ఐటీ సూచీ 2.2 శాతం తగ్గి 36,826 పాయింట్ల స్థాయికి పడిపోయింది. 2024, జులై తర్వాత ఈ స్థాయికి పడిపోవడం ఇదే తొలిసారి. నిఫ్టీ ఐటీ సూచీలో ఉన్న 10 స్టాక్స్ నెగిటివ్ గానే ట్రేడయ్యాయి. అత్యధికంగా ఇన్ఫోసిస్ కంపెనీ షేర్లు 3.2 శాతం మేర పడిపోయాయి. విప్రో, టెక్ మహీంద్రా, ఎల్ అండ్ టీ, కోఫోర్జ్ వంటి కంపెనీల షేర్లు 1 నుంచి 2 శాతం మేర క్షీణత నమోదు చేశాయి. ఫాక్స్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అమెరికాలో మాంద్యం ముప్పు పొంచి ఉందా? అని అడగగా.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమాధానం చెప్పలేదు. ఇన్వెస్టర్లంతా ట్రంప్ అనుసరిస్తున్న వాణిజ్య విధానాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కెనడా, మెక్సికో, చైనా దేశాలపై ప్రతీకార సుంకాలు పెంచడం కన్స్యూమర్ డిమాండ్ తగ్గిస్తోంది. కార్పొరేట్ పెట్టుబడులు సైతం తగ్గుముఖం పడతాయి. ఈ ఆందోళన క్రమంలో అమెరికా స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలు నమోదు చేస్తున్నాయి.

3 నెలల్లో 20 శాతం తగ్గిన నిఫ్టీ ఐటీ సూచీ

అమెరికా ఆర్థిక వృద్ధి మందగమనం, మాంద్యం భయాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఐటీ స్టాక్స్ భారీగా అమ్మేస్తున్నారు. నిఫ్టీ ఐటీ సూచీ మూడు నెలల్లోనే దాదాపు 20 శాతం మేర పడిపోయింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత ఆలస్యం చేస్తుందనే అంచనాలు సైతం ఐటీ స్టాక్స్ పై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయి.

# పాంటింగ్ నేను ఓపెనింగ్‌కు రెడీ.. బ్యాటింగ్ ప్రాక్టీస్‌లో చాహల్ బిజీ



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ ప్రస్తుతం ఐపీఎల్ 2025 సీజన్ కు సిద్ధమవుతున్నాడు. టీమిండియాలో చోటు కోల్పోయినా ఐపీఎల్ లో చాహల్ అద్భుతంగా రాణిస్తున్నాడు. మరో 10 రోజుల్లో జరగబోయే ఐపీఎల్ లో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నాడు. మూడు సీజన్ లుగా రాజస్థాన్ రాయల్స్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఈ లెగ్ స్పిన్నర్.. రానున్న సీజన్ కోసం పంజాబ్ కింగ్స్ తరపున ఆడనున్నాడు. ఇందులో భాగంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ లో బిజీగా మారిపోయాడు. అదేంటి చాహల్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడం ఆశ్చర్యంగా అనిపించినా అసలు విషయమేంటో ఇప్పుడు చూద్దాం. పంజాబ్ కింగ్స్ తరపున తొలిసారి ఆడబోతున్న చాహల్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ షాక్ ఇచ్చాడు. సోమవారం(మార్చి 10) తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్‌ను షేర్ చేశాడు. ఈ వీడియోలో చాహల్ బ్యాటింగ్ చేస్తూ కనిపించాడు. ప్రత్యర్థి బౌలర్, వికెట్ కీపర్‌తో బ్యాటింగ్ గురించి చర్చిస్తున్నాడు. తన ఇన్‌స్టాగ్రామ్ లో "పాంటింగ్ ఓపెనింగ్ స్లాట్ ఏమైనా ఖాళీగా ఉందా.. నేను సిద్ధంగా ఉన్నాను". అని సరదాగా రాసుకొచ్చాడు. చాహల్ బ్యాటింగ్ ప్రాక్టీస్, అతని పోస్ట్ కు నవ్వు తెప్పించే విధంగా ఉన్నాయి. 2025 ఐపీఎల్ సీజన్ లో బలంగా కనిపిస్తున్న పంజాబ్ కింగ్స్ కు సరైన ఓపెనర్లు లేరు. ఒక ఓపెనర్ గా ప్రబు సిమ్రాన్ సింగ్ ఉన్నా.. అతనితో పాటు మరో ఓపెనర్ లేకపోవడం విశేషం. ఈ నేపథ్యంలో చాహల్ పెట్టిన పోస్ట్ వైరల్ గా మారుతుంది. ఐపీఎల్ లో ఇప్పటివరకు అత్యధిక వికెట్లు పడగొట్టిన రికార్డ్ చాహల్ పేరిట ఉంది. 160 మ్యాచ్ ల్లో 205 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. యల్ చరిత్రలో 200 వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్ గా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. 2025 ఐపీఎల్ మెగా ఆక్షన్ లో చాహల్ ను రూ.18 కోట్లకు పంజాబ్ కింగ్స్ సొంతం చేసుకుంది. ఈ లెగ్ స్పిన్నర్ పై పంజాబ్ కింగ్స్ భారీ అసలు పెట్టుకుంది.

# స్మిత్, ఫిలిప్స్‌లను వెనక్కి నెట్టి.. ఐసీసీ అవార్డు సొంతం చేసుకున్న గిల్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా యంగ్ ప్లేయర్ శుభమాన్ గిల్ అరుదైన ఘనత సాధించాడు. ఫిబ్రవరి నెలలో ఇంగ్లాండ్ తో జరిగిన వన్డే సిరీస్?లో అద్భుతంగా రాణించడంతో బుధవారం (మార్చి 12) గిల్?ను ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు వరించింది. ఈ అవార్డు కోసం ఆస్ట్రేలియా బ్యాటర్ స్టీవ్ స్మిత్, న్యూజిలాండ్ బ్యాటర్ ఫిలిప్స్ పోటీ పడగా వీరిద్దరినీ టీమిండియా వన్డే వైస్ కెప్టెన్ వెనక్కి నెట్టి అవార్డు సింథమ్ చేసుకున్నాడు. ఫిబ్రవరి నెలలో గిల్ అత్యద్భుతంగా రాణించాడు. ఈ నెలలో ఐదు వన్డేలాడిన గిల్ 94.19 స్ట్రైక్ రేట్‌తో 406 పరుగులు చేశాడు. అతని యావరేజ్ 100 కి పైగా ఉండడం విశేషం. ఇంగ్లాండ్ పై భారత్ 3-0 తేడాతో సిరీస్ గెలుచుకోవడంలో గిల్ దే ప్రధాన పాత్ర. ఈ సిరీస్ వరుసగా మూడు వన్డేల్లో 50 కి పైగా స్కోర్లు చేశాడు. నాగ్‌పూర్‌లో జరిగిన తొలి మ్యాచ్ లో 87 పరుగులు.. రెండో వన్డేలో కటక్‌లో 60 పరుగులు.. చేసిన గిల్ అహ్మదాబాద్ వేదికగా జరిగిన మూడో వన్డేలో సెంచరీ బాదాడు. ఈ మ్యాచ్ లో కేవలం 102 బంతుల్లోనే 112 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ తో పాటు, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు సొంతం చేసుకున్నాడు.

గిల్ ఇదే ఫామ్ ను ఛాంపియన్స్ ట్రోఫీలోనూ కొనసాగించాడు. బంగ్లాదేశ్ తో జరిగిన తొలి మ్యాచ్ లో 101 పరుగులు చేసిన ఈ టీమిండియా ఓపెనర్.. ఆ తర్వాత చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ పై 46 పరుగులు చేశాడు. ఓవరాల్ గా ఫిబ్రవరి నెలలో గిల్ ఐదు ఇన్నింగ్స్ ల్లో ఒక సెంచరీతో పాటు మూడు హాఫ్ సెంచరీలు చేశాడు. గిల్‌కు ఇది మూడో ఐసీసీ పురుషుల ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు కావడం విశేషం. గతంలో 2023 జనవరి, సెప్టెంబర్‌లలో రెండుసార్లు ఈ అవార్డును గెలుచుకున్నాడు.

# ఆస్ట్రేలియా,ఇంగ్లాండ్ బాటలో ఐరీష్.. ఆఫ్ఘనిస్తాన్‌తో సిరీస్ రద్దు చేసుకున్న ఐర్లాండ్




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ లో ఆఫ్ఘనిస్తాన్ కు మరో బ్యాడ్ న్యూస్. ఐర్లాండ్ క్రికెట్ ఆఫ్ఘనిస్తాన్ టూర్ ను రద్దు చేసుకుంది. ఆర్థిక కారణాలను చూపుతూ ఆఫ్ఘనిస్తాన్ తో జరగాల్సిన సిరీస్ ను రద్దు చేస్తున్నట్టు ఐర్లాండ్ క్రికెట్ ప్రధాన ప్రకటన చేసింది. సిరీస్ నుంచి తప్పుకొని ఐర్లాండ్ షాక్ ఇవ్వడం సంచలనంగా మారింది. చాలామంది రాజకీయ కారణాలే అని చర్చించారు. గతంలో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్లు ఆఫ్ఘనిస్తాన్ తో జరగాల్సిన సిరీస్ ను రద్దు చేసుకున్నాయి. మహిళా స్వేచ్ఛ, అమ్మాయిల విద్య, ఉద్యోగాలపై తాలిబన్ ప్రభుత్వం ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఆ సిరీస్ ను బహిష్కరిస్తున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది.

ఇంగ్లాండ్ కూడా ఇదే కారణాన్ని చూపిస్తూ ఆఫ్ఘనిస్తాన్ తో సిరీస్ రద్దు చేసుకుంది. అయితే క్రికెట్ ఐర్లాండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వారెన్ డ్యూట్రోమ్ ఆఫ్ఘనిస్తాన్‌తో ఆడకపోవడానికి ఆర్థికపరమైన కారణాలేనని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం ఐర్లాండ్ ఒక టెస్ట్, మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. రానున్న సమ్మర్ లో ఐర్లాండ్ బిజీ షెడ్యూల్ కారణంగా కూడా ఈ మల్టీ ఫార్మాట్ సిరీస్ రద్దు చేసుకున్నట్టు తెలుస్తుంది. మే 21 నుంచి ఐర్లాండ్ వెస్టిండీస్ తో మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్ లు ఆడనుంది. ఐర్లాండ్ వైదొలగడంతో ఆఫ్ఘనిస్తాన్ కు ప్రస్తుతం అంతర్జాతీయ మ్యాచ్‌లు లేకుండా పోయాయి.

ప్రస్తుత క్రికెట్ లో ఆఫ్ఘనిస్తాన్ అగ్ర శ్రేణి జట్లలో ఒకటిగా మారుతోంది. ఆ జట్టు సాధిస్తున్న పురోగతి అద్భుతం. 2024 టీ20 వరల్డ్ కప్ లో అగ్ర జట్లకు షాకిస్తూ సెమీ ఫైనల్ కు చేరుకుంది. ఇటీవలే ఛాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లాండ్ ను ఓడించి సెమీస్ రేస్ లో నిలిచింది. అంతకముందు భారత్ వేదికగా జరిగిన 2023 వన్డే వరల్డ్ కప్ లో సెమీస్ కు దగ్గరకు వచ్చింది.

# అల్లు అర్జున్ - అట్లీ.. సినిమా ఎలా ఉండబోతోందంటే?



శ్రియా శరణ్ తన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్నాప్‌షాట్‌లలో అందాలను ఆరబోసింది





దేవియాని శర్మ యొక్క తాజా లుక్ సింప్లిసిటీ శక్తివంతమైనదని రుజువు చేస్తుంది

ఇటీవల కాలంలో పాన్ ఇండియా సినిమాల స్థాయి పూర్తిగా మారిపోయింది. ఇక మామూలు మాస్ కమర్షియల్ సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడం కష్టమవుతోంది. భారీ బడ్జెట్, విభిన్న కథ, ఊహించని మేకింగ్ స్టైల్ తప్పకుండ ఉండాలి. ముఖ్యంగా దర్శకులు ఇప్పుడు కథకు తగ్గట్లుగా కొత్త ప్రపంచాన్ని సృష్టించేందుకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. అదే రూట్లో మరో కాంబినేషన్ కూడా రెడీ అవుతోంది.

రాజమౌళి 'బాహుబలి' కోసం మహిష్మతిని సృష్టించాడని, ప్రశాంత్ నీల్ 'కేజీఎఫ్' లో గోల్డ్ ఫీల్డ్ మాఫియాను చూపించాడని, అదే ట్రెండ్ సలార్, దేవర సినిమాల వరకూ కొనసాగింది. ఇప్పుడు ఇదే తరహాలో అల్లు అర్జున్ - అట్లీ సినిమా కూడా రూపొందబోతోందనే టాక్ ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను జూన్ లో లాంచ్ చేసి, 2026 ఆగస్ట్ లో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అంటే, ఈ సినిమా షూటింగ్ కోసం ఏడాది సమయం వెచ్చించబోతున్నారు.చూస్తుంటే అట్లీ ఇప్పటి వరకు చేసిన సినిమాలకు పూర్తిగా భిన్నంగా ఉండేలా, విభిన్నమైన స్క్రిప్ట్ సిద్ధం చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. పక్కా కమర్షియల్ మేకర్‌గా పేరు తెచ్చుకున్న అట్లీ, ఈసారి తన మార్క్ స్టైల్‌ను 'కేజీఎఫ్' లేదా 'దేవర' తరహాలో మాస్ లెవెల్‌కు తీసుకెళ్లబోతున్నట్లు తెలుస్తోంది. 'జవాన్'తో బాలీవుడ్‌ను శాసించిన అట్లీ, ఇప్పుడు టాలీవుడ్‌లో మునుపెన్నడూ లేని స్కేల్‌లో సినిమా చేయాలని పట్టుదలగా ఉన్నట్లు సమాచారం.

ఈ సినిమా గురించి బయటకు వస్తున్న అప్‌డేట్ ప్రకారం, ఒక కొత్త ప్రపంచాన్ని సెటప్ చేసేలా కథను డిజైన్ చేసినట్లు సమాచారం. కథలో కొత్త వాతావరణాన్ని రూపొందించేందుకు గ్రాండ్ సెట్స్, హైటెక్ విజువల్స్, యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో అట్లీ సినిమాను ప్లాన్ చేస్తున్నట్లు టాక్. బన్నీ కోసం హై ఇంటెన్సిటీ క్యారెక్టర్ డిజైన్ చేయడం మాత్రమే కాకుండా, స్టైల్, లుక్ పరంగా కూడా కొత్తగా కనిపించేలా ఫుల్ మేకోవర్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.పాన్ ఇండియా సినిమా కావడం వల్ల, ఇందులో తమిళ, హిందీ పరిశ్రమల నుండి సీనియర్ నటులను తీసుకోవడానికి కూడా స్క్రిప్ట్ రీ డిజైన్ జరుగుతోందని సమాచారం. ఇప్పుడు బన్నీ - అట్లీ కాంబినేషన్ కూడా అదే తరహాలో ప్రేక్షకులను ఊహించని దిశగా తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఫ్యూచరిస్టిక్ యాక్షన్ డ్రామా, ఒక రివోల్యూషనరీ కథ, పీరియాడిక్ యాక్షన్ డ్రామా అనే మూడు ప్రధాన కథాంశాలతో ఈ సినిమా ఉండొచ్చని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది.ఈ సినిమా కోసం బడ్జెట్ పరంగా కూడా భారీ స్థాయిలో ఖర్చు చేయబోతున్నట్లు టాక్. బన్నీ క్రేజ్, అట్లీ ట్రాక్ రికార్డ్‌ను బట్టి ఈ సినిమా 400-500 కోట్ల బడ్జెట్‌తో రూపొందించే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే 'పుష్ప 2'తో బన్నీ మార్కెట్ 1800 కోట్లకు పైగా వసూళ్లు సాధించే స్థాయికి వెళ్లింది. దీంతో, ఈ సినిమా తర్వాత ఇంకో మెట్టు పైకి వెళ్లేలా బన్నీ ప్లాన్ చేస్తున్నాడు. ఈ లెవెల్‌లో సినిమాకు హైప్ క్రియేట్ చేయాలంటే, కేవలం స్టోరీ, యాక్షన్ మాత్రమే కాకుండా, అట్లీ ప్రత్యేకమైన మాస్ కమర్షియల్ ట్రీట్మెంట్ కూడా ఉండాలి. మరి అట్లీ ప్లానింగ్ ఏ లెవెల్లో ఉంటుందో చూడాలి.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com